

విహారయాత్రలో విషాదం
సోకిలేరు వాగులో మునిగి విజయవాడకు చెందిన జిమ్ ట్రైనర్ మృతి 6
కాకినాడలో రెండో రోజు అంతర్ జిల్లాల ఖోఖో పోటీలు 6

సత్యసాయిని ఆదర్శంగా తీసుకుని ప్రజలకు సేవ చేయాలి

- జిల్లా కలెక్టర్ షాన్‌మోహన్
- కలెక్టరేట్‌లో శతజయంతి వేడుకలు

కలెక్టరేట్(కాకినాడ),నవంబరు 23(ఆంధ్రజ్యోతి): భగవాన్ శ్రీసత్యసాయి బాబాను ఆదర్శంగా తీసుకుని ప్రతి వ్యక్తి సమాజంలో ప్రజలకు సేవ చేయాలని జిల్లా కలెక్టర్ షాన్‌మోహన్ అన్నారు. సత్యసాయి బాబా శతజయంతి వేడుకలను రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా నిర్వహించాలన్న ఆదేశాల మేరకు ఆదివారం కాకినాడ కలెక్టరేట్‌లో సత్యసాయి సేవా సంఘం ఆధ్వర్యంలో వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సత్యసాయి బాబా శత జయంతి వేడుకల్లో పాల్గొనడం చాలా సంతోషంగా ఉందన్నారు. బాబా ఆధ్యాత్మిక బోధనలు, మానవతా దృక్పథంతో అందించిన సేవా కార్యక్రమాల్లో ప్రతిరోజు ప్రసిద్ధి చెందారన్నారు. చిన్నతనంలోనే తన ఆధ్యాత్మిక మిషన్ ప్రకటించి సత్యం, ధర్మం, శాంతి, ప్రేమ,సేవ అనే సూత్రాల ద్వారా మానవాళిని ఆధ్యాత్మికంగా సంకల్పంతో విశ్వవ్యాప్తంగా తన బోధనలు, సేవలు చేశారన్నారు. సత్యసాయిబాబా విద్య, వైద్య, ఆధ్యాత్మిక రంగాల్లో విస్తృతంగా చేపట్టిన సేవలు నేటికీ కొనసాగుతున్నాయన్నారు. అనంతపురం జిల్లాకు తాగునీరు అందించడం వంటి గొప్ప కార్యక్రమాలు చేపట్టారన్నారు. పాఠశాలలు, ఆస్పత్రులు నిర్మించడం, గ్రామాలకు తాగునీరు ప్రాజెక్టులు అందించడం వంటి సేవా కార్యక్రమాలు చేశారన్నారు. తొలుత సత్యసాయిబాబా చిత్రపటానికి పూలమాలలు వేసి పూజా కార్యక్రమాలు నిర్వహించారు. సత్యసాయి సంఘం ఆధ్వర్యంలో భక్తులు భజనలు, భక్తి కీర్తనలు చేపట్టారు. సత్యసాయి సేవా సమితి సభ్యులు అశోక్‌కుమార్, డాక్టర్ శ్యామల, సత్యసాయిబాబా జీవిత విశేషాలను వివరించారు. కార్యక్రమంలో కాకినాడ సిటీ ఎమ్మెల్యే వనమాడి కొండబాబు, డీఆర్వో వెంకట్రావు, జీజీహెచ్ అడ్మినిస్ట్రేటివ్ అధికారి శ్రీధర్, కలెక్టరేట్ పరిపాలనాధికారి రామ్మోహన్ రావు, సమాచారం పౌరసంబంధాల అధికారి నాగార్జున పాల్గొన్నారు.



సత్య సాయిబాబా శత జయంతి వేడుకల్లో పాల్గొన్న కలెక్టర్ షాన్‌మోహన్, డీఆర్వో వెంకట్రావు, కాకినాడ సిటీ ఎమ్మెల్యే వనమాడి కొండబాబు

బాబోయ్.. బాదుడు



- సంక్రాంతి పండుగకు ఊరొచ్చే దారేది
- అప్పుడే బస్సులు, రైళ్లు, విమాన చార్జీల దోపిడీ
- జనవరి 10 నుంచి వీటన్నింటిలో టికెట్ ధరలు మూడింతలపైనే
- హైదరాబాద్ టు రాజమహేంద్రవరం ఏకంగా రూ.16 వేలు దాటేసిన ఇండిగో చార్జి
- బెంగళూరు నుంచి రూ.14వేలపైనే
- హైదరాబాద్ నుంచి రాజమహేంద్రవరం, కాకినాడ వైపు వచ్చే రైళ్లన్నీ రిగ్రెట్
- అటు ప్రైవేటు ట్రావెల్ బస్సుల ఏసీ స్లీపర్ చార్జీలు తడిసిమోపెడు
- హైదరాబాద్ నుంచి వచ్చే ఆర్టీసీ ఏసీ, సూపర్ లగ్జరీ బస్సుల్లో జనవరి 9 నుంచే సీట్లు సున్నా

(కాకినాడ-ఆంధ్రజ్యోతి)

సంక్రాంతి పండగకు అప్పుడే చార్జీలు షాక్ కొడుతున్నాయి. స్వగ్రామాలకు రావాలంటేనే టికెట్ ధరలు గూబగుయ్‌మనిపిస్తున్నాయి. బస్సులు.. విమానాలు.. రైలు చార్జీలు మూడింతలు పెరిగిపోయాయి. టికెట్ కొందామన్నా ఏకంగా దొరకని పరిస్థితికి చేరిపోయాయి. వచ్చే ఏడాది జనవరి 14న బుధవారం సంక్రాంతి పండుగ. దీంతో ఆంధ్రప్రదేశ్, తెలంగాణ ప్రభుత్వాలు కూడా ముందుగానే జనవరి 10 నుంచి సెలవులు ప్రకటించాయి. దీంతో అప్పటి నుంచి వివిధ ప్రాంతాల్లో ఉద్యోగ, ఉపాధి పనులపై ఎక్కడెడక్కడో ఉంటున్న వారంతా పండుగకోసం ఉమ్మడి జిల్లాలో వారి స్వగ్రామాలకు చేరుకుంటారు. ప్రధానంగా సంక్రాంతికి ఉమ్మడి జిల్లాకు చెందిన వారు హైదరాబాద్ నుంచి ఎక్కువగా వస్తుంటారు. అక్కడ వ్యాపారాలు, ఉద్యోగాలు, సినిమా రంగంలో ఉన్నవారు, పండగ ఆనందాలకు బంధువుల రూపంలో కాకినాడ, రాజమహేంద్రవరం, కోనసీమ ప్రాంతాలకు వస్తారు. అయితే ఇప్పటి నుంచే చార్జీలు ఆకాశాన్నంటేశాయి. సాధారణంగా సంక్రాంతి పండగకు వచ్చే వారికి ఎప్పుడో డిసెంబరు రెండో వారం నుంచి చార్జీలు పెరుగుతుంటాయి. కానీ ఈసారి పండుగకు ఏకంగా నవంబరుకే అన్నీ మూడింతలు పెరిగిపోయాయి. హైదరాబాద్ నుంచి ఉమ్మడి జిల్లా వైపు వచ్చే రైళ్లన్నీ నిండిపోయి ఇప్పటికే రిగ్రెట్ చూపిస్తుండడం విశేషం.

బాబోయ్ ఎగరలేం..

పండగ అంటే సంక్రాంతి. ఈ పండుగకు ఎవరు ఎక్కడ ఉన్నా ముందుగానే రెక్కలు కట్టుకుని సొంతూర్లకు రావలసిందే. బంధుమిత్రులతో సరదాగా గడపాల్సిందే. ముఖ్యంగా ఉమ్మడి జిల్లాలో సంక్రాంతి సందడే వేరు. భోగిమంటలు, కోడి పందేలు, గుండాట, జాతర్లతో ఏ ఊరు చూసినా సందడిగా మారుతుంది. ఉమ్మడి జిల్లాకు చెందినవారు ఎక్కువమంది సినిమా రంగం, ఐటీ, వ్యాపారరంగాలు, ఉద్యోగాల పేరుతో హైదరాబాద్‌లోనే స్థిరపడ్డారు. వారంతా పిల్లాపాపలతో సొంతూర్లకు చేరుతారు. అయితే పండుగకు ఇంకా యాభై రోజులు ఉండగానే చార్జీలు మాత్రం అప్పుడే షాక్ కొట్టేస్తున్నాయి. ముఖ్యంగా హైదరాబాద్ నుంచి రాజమహేంద్రవరానికి సాధారణ రోజుల్లో ఇండిగో టికెట్ చార్జీ రూ.4,271 వరకు ఉంటోంది. కానీ జనవరి 10 నుంచి మాత్రం చూస్తే గుండె గుబేల్‌మంటోంది. ఏకంగా ఈ రూట్లో అప్పుడే టికెట్ ఛార్జీ గరిష్ఠంగా రూ.16,241కి చేరిపోయింది. ఈ మార్గంలో హైదరాబాద్ నుంచి రాజమహేంద్రవరానికి రోజూ ఇండిగో నాన్‌స్టాప్, సింగిల్‌స్టాప్ కేటగిరీలో ఎనిమిది సర్వీసులు నడుపుతోంది. కానీ సంక్రాంతి రద్దీ నేపథ్యంలో ప్రయాణికుల డిమాండ్‌ను దృష్టిలో ఉంచుకుని అప్పుడే ధరలను భారీగా పెంచేసింది. పండుగకు ఎక్కువ మంది కాస్త ధర ఎక్కువైనా వేగంగా వచ్చేందుకు విమానాలనే ఎంచుకుంటున్నారు. దీంతో జనవరి నుంచి భోగి పండుగ రోజు వరకు చార్జీలను దారుణంగా పిండేస్తోంది. తీరా సంక్రాంతి పండుగ రోజురూ.5,800 మాత్రమే వసూలు చేస్తోంది. అటు బెంగళూరులో పనిచేస్తోన్న ఉమ్మడి జిల్లాకు చెందిన సాఫ్ట్‌వేర్ ఇంజనీర్లు పండుగకు ముందే వస్తారు. వీరిని కూడా జనవరి 10వ తేదీ నుంచి రూ.14 వేల వరకు పిండేస్తోంది. సాధారణ రోజుల్లో ఈ రూట్లో చార్జీ రూ.4,763కాగా, పండగ సాకుతో మూడింతలపైనే వసూలు చేస్తోంది.

రైళ్లన్నీ రిగ్రెట్...

హైదరాబాద్ నుంచి సంక్రాంతి పండగకు ఉమ్మడి జిల్లాలో రాజమహేంద్రవరం, సామర్లకోట, కడియం, అన్నవరం, తుని, కోనసీమ ప్రాంతాలకు వచ్చే వారంతా ఎక్కువగా రైళ్లపై ఆధారపడతారు. తీరా ఇవి కూడా వెయిటింగ్ లిస్ట్ కూడా నిండిపోయి ఏకంగా రిగ్రెట్ చూపిస్తున్నాయి. సాధారణ రోజుల్లో ఈ రూట్లో రైళ్లకు రద్దీ ఎప్పుడూ ఉంటుంది. తీరా సంక్రాంతి పండుగకు అయితే అంతకుమించి అన్నట్టు మారిపోయింది. ముఖ్యంగా హైదరాబాద్ నుంచి ఉమ్మడి జిల్లా మీదుగా నిత్యం 17 రైళ్లు రాకపోకలు సాగిస్తుంటాయి. అయితే పండగ నేపథ్యంలో జనవరి 10 నుంచి ఇవన్నీ నిండిపోయాయి. ఎప్పుడూ ఎన్నోకొన్ని సీట్లు ఖాళీగా ఉండే వందే భారత్ రైళ్లలో కూడా జనవరి 10 నుంచి 13వ తేదీ వరకు రిగ్రెట్ చూపిస్తోంది. అంటే వెయిటింగ్ లిస్ట్ టిక్కెట్లు కూడా అయిపోయి టికెట్ కూడా ఇవ్వని పరిస్థితికి చేరింది. అలాగే గరీబ్‌రథ్ జనవరి 12వరకు రిగ్రెట్ చూపిస్తోంది. విశాఖ ఏసీ ఎక్స్‌ప్రెస్, ఫలక్‌నుమా, గౌతమీ ఎక్స్‌ప్రెస్ రైళ్లన్నీ 13వ తేదీ వరకు రిగ్రెట్ కనిపిస్తోంది. చర్లపల్లి, సాయినగర్ షిర్డీ, ఈస్ట్‌కోస్ట్, కోణార్క్, విశాఖ ఎల్‌టీటీ సైతం అదే పరిస్థితి. చివరకు హైదరాబాద్ నుంచి వచ్చే జన్మభూమి ఎక్స్‌ప్రెస్ రైలు కూడా 13 వరకు సీట్లన్నీ రిగ్రెట్‌లోకి వెళ్లాయి.

ట్రావెల్స్ ఉతుకుడు..

ప్రైవేటు ట్రావెల్స్ విషయానికొస్తే హైదరాబాద్ నుంచి రాజమహేంద్రవరం, కాకినాడ, రావులపాలెం వైపు వచ్చేవన్నీ అప్పుడే చార్జీలు మూడింతలు పెంచేశాయి. సాధారణ రోజుల్లో హైదరాబాద్ నుంచి రాజమహేంద్రవరం, కాకినాడ వైపు ఏసీ స్లీపర్ బస్సు చార్జీలు రూ.1079 నుంచి రూ.1419 వరకు ఉన్నాయి. కానీ సంక్రాంతి దోపిడీలో భాగంగా జనవరి 10 నుంచి ఏకంగా ఆయా ట్రావెల్స్ ఆధారంగా రూ.4150 నుంచి రూ.6 వేల వరకు వసూలు చేస్తున్నాయి. ఇప్పటికే సగానికిపైగా సీట్లు ఫుల్ అయినట్టు చూపుతున్నాయి. పండుగ దగ్గరయ్యే కొద్దీ ఈ రేట్లు మరింత పెంచడానికి సిద్ధమవుతున్నాయి. ఇక హైదరాబాద్ నుంచి రాజమహేంద్రవరానికి ఆర్టీసీ రోజుకు 15 ఏసీ, నాన్‌ఏసీ సూపర్‌లగ్జరీ బస్సులు నడుపుతుండగా, జనవరి 9 నుంచి 12 వరకు మూడు రోజుల్లో ఒక్క సీటు కూడా ఖాళీగా లేదు. మొత్తం అన్నీ బుక్ అయిపోవడంతో సోల్డ్‌అవుట్ కనిపిస్తోంది. కాకినాడకు హైదరాబాద్ నుంచి రోజూ ఆరు సర్వీసులు నడుస్తుండగా జనవరి 9 నుంచే ఫుల్ అయిపోయాయి

వృద్ధులకు ప్రత్యేకం

- జీజీహెచ్‌లో ప్రత్యేక జెరియాట్రిక్స్ ఓపీ ప్రారంభం
- 65ఏళ్లు పైబడిన వృద్ధుల సౌలభ్యం కోసం ఆదివారం నిర్వహణ
- మొదటిరోజు వైద్యసేవలు పొందిన 53మంది వృద్ధ రోగులు



కాకినాడ జీజీహెచ్‌లో ఓపీని ప్రారంభిస్తున్న వైద్య నిపుణులు

జీజీహెచ్(కాకినాడ), నవంబరు 23(ఆంధ్రజ్యోతి): కాకినాడ జీజీహెచ్‌లో జెరియాట్రిక్స్ (వృద్ధాప్య) ప్రత్యేక ఓపీని ఆదివారం ప్రారంభించారు. 65ఏళ్లు పైబడిన వృద్ధుల సౌలభ్యం కోసం ఈ ఓపీ సేవలను విశ్రాంత వైద్య నిష్టాతులు అందించనున్నారు. ఈ ప్రారంభ కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా ఆర్ఎంసీ ప్రిన్సిపాల్ డాక్టర్ ఎ.విష్ణువర్ధన్, జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ లావణ్యకుమారి హాజరయ్యారు. విశ్రాంత డీఎంఈ డాక్టర్ ఎంబీ ఆర్ శర్మ ఈ విభాగాన్ని ప్రారంభించారు. మొదటి రోజు మొత్తం 53మంది వృద్ధరోగులు వైద్యసేవలు పొందగా వారిలో 38మంది పురుషులు, 15 మంది మహిళలు ఉన్నారు. వారికి అవసరమైన వైద్యపరీక్షలను తక్షణం నిర్వహించి మందులను ఫార్మసీ ద్వారా వెంటనే ఉచితంగా అందించారు. ఈ వైద్యసేవలను జనరల్ మెడిసిన్ విభాగ విశ్రాంత ప్రొఫెసర్లు డాక్టర్ ఎంబీఆర్ శర్మ, డాక్టర్ సీఎస్ఎస్ శర్మ, డాక్టర్ ఎస్వీ రమణమూర్తి అందించారు. వృద్ధుల వైద్య సేవలకు స్వచ్ఛందంగా ముందుకొచ్చిన ముగ్గురు విశ్రాంత ప్రొఫెసర్లను ప్రిన్సిపాల్, సూపరింటెండెంట్లు ఘనంగా సత్కరించారు. ప్రతి ఆదివారం నిర్వహించే ఈ జనరల్ మెడిసిన్ ఓపీలో ఒక్కోఆదివారం ఒక్కో విశ్రాంత ప్రొఫెసర్ తమ అనుభవాన్ని జోడించి వైద్యసేవలు, చికిత్స అందజేస్తారని సూపరింటెండెంట్ డాక్టర్ లావణ్యకుమారి అన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ సూపరింటెండెంట్, ఆంకాలజీ హెచ్‌వోడీ డాక్టర్ పద్మనాభన్‌శ్రీనివాసన్, సీఎస్ఆర్ ఎంవో డాక్టర్ కోమల, మెడిసిన్ హెచ్‌వోడీ డాక్టర్ యశోదమ్మ,ఏపీఎన్జీవో సంఘ జిల్లా కార్యదర్శి పాలపర్తి మూర్తిబాబు, అడ్మినిస్ట్రేటర్ శ్రీధర్, నర్సింగ్ సూపరింటెండెంట్ గ్రేడ్-2 ఫ్లోరెన్స్, ఎన్జీవో సంఘ జిల్లా మాజీ అధ్యక్షుడు ఆచంట రామారాయుడు, సీనియర్ సిటిజన్స్‌సంఘ కార్యదర్శి రత్నప్రసాదరావు పాల్గొన్నారు.

కాకినాడ నూతన కమిషనర్‌గా సత్యనారాయణ

నేడు బాధ్యతల స్వీకారం

కార్పొరేషన్(కాకినాడ), నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): కాకినాడ నగరపాలక సంస్థ కమిషనరు(ఎఫ్ఏసీ)గా గృహ నిర్మాణ సంస్థ పీడీ, స్పెషల్ గ్రేడ్ డిప్యూటీ కలెక్టర్ ఎన్వీవీ సత్యనారాయణ సోమవారం బాధ్యతలు చేపట్టనున్నారు. విశాఖపట్నంలో అదనపు కమిషనర్‌గా పనిచేస్తున్న ఎస్ఎస్ వర్మకు ఇటీవల కాకినాడ కమిషనరుగా అదనపు బాధ్యతలు అప్పగిస్తూ పురపాలకశాఖ ఉత్తర్వులు జారీ చేసింది. దాన్ని ఈనెల 19న రద్దు చేశారు. ఈ క్రమంలో హౌసింగ్ పీడీ సత్యనారాయణకు పూర్తి అదనపు బాధ్యతలు అప్పగిస్తూ ప్రభుత్వ ఆదేశాలతో కలెక్టర్ ఉత్తర్వులు జారీ చేశారు. ఆయన గతంలో కాకినాడ జడ్పీ సీఈవోగా, కాకినాడ ఆర్డీవోగా పనిచేశారు. ఆ అనుభవంతో స్థానిక సమస్యలపై అవగాహనతో తన మార్క్ చూపిస్తారని అందరూ అభిప్రాయపడుతున్నారు.

బెండపూడి విద్యార్థి ప్రాజెక్టుకు జాతీయస్థాయి అవార్డు

తొండంగి,నవంబరు 23(ఆంధ్రజ్యోతి): తొండంగి మండలం బెండపూడి ఉన్నత పాఠశాల విద్యార్థి రూపొందించిన ప్రాజెక్టు జాతీయస్థాయిలో ఉత్తమ ప్రాజెక్టుగా ఎంపికైంది. సోలార్ పలకల ద్వారా వ్యవసాయ అవసరాలకు విద్యుత్ సరఫరాపై విద్యార్థి బలరాంశివ రూపొందించిన ప్రాజెక్టు జిల్లా, రాష్ట్రస్థాయిలో ఉత్తమ ప్రదర్శనతో జాతీయస్థాయికి ఎంపికైంది. కేంద్ర విద్యాశాఖ ముఖ్యకార్యదర్శి సంజయ్‌కుమార్, ఎన్‌సీఆర్‌టీ డైరెక్టర్ దినేష్‌ప్రసాద్ విశ్వాస్ కైలాస్ సారంగా నుంచి జాతీయ వేదికపై న్యూఢిల్లీలో అవార్డు అందుకున్నట్టు పాఠశాల ప్రధానోపాధ్యాయుడు నాగం కృష్ణమూర్తి తెలిపారు. జాతీయస్థాయిలో పాఠశాల ప్రతిభను ఇనుమడింపజేసిన విద్యార్థి, గైడ్ టీచర్‌లను తుని ఎమ్మెల్యే యనమల దివ్య, ఎంఈవోలు షేక్ బాబ్జీ, సుబ్బిరెడ్డి అభినందించారు.



అవార్డు అందుకుంటున్న విద్యార్థి బలరాంశివ

నేడు ప్రజాఫిర్యాదుల పరిష్కార వేదిక

కలెక్టరేట్(కాకినాడ),నవంబరు 23(ఆంధ్రజ్యోతి): కాకినాడ కలెక్టరేట్‌లో సోమవారంఉదయం 10గంటలకు ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహిస్తామని కలెక్టర్ షాన్‌మోహన్ తెలిపారు. ఈ మేరకు ఒక ప్రకటన వెలువరించారు. జిల్లాలోఉన్న అన్నిశాఖల అధికారులు దీనిలో పాల్గొంటారన్నారు. అర్జీదారులు దాఖలు చేసిన అర్జీలు పరిష్కారం కాకపోతే 1100నెంబరుకు కాల్ చేయాలన్నారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

జిల్లా కలెక్టర్ నేడు.. ఢిల్లీకి పయనం

కలెక్టరేట్(కాకినాడ),నవంబరు 23(ఆంధ్రజ్యోతి): జిల్లాకలెక్టర్ షాన్‌మోహన్ సోమవారం సాయంత్రం 4గంటలకు పయనమై న్యూఢిల్లీకి వెళ్లనున్నారు. రెండు రోజులపాటు ఆయన న్యూఢిల్లీలో పర్యటిస్తారు. నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్‌లో పెండింగ్‌లో ఉన్న కేసు విషయమై హాజరవుతున్నారు. అనంతరం ఉప్పాడ తీరప్రాంతరక్షణకు రూ.323కోట్లతో నిర్మించే రక్షణ గోడకు నిధులు విడుదలపై కేంద్రంలో ఉన్నతాధికారులతో సమావేశమవుతారు. కాకినాడ, కరప, తాళ్లరేవు మండలాల్లోని ఉప్పు భూములు 1245 ఎకరాలను జిల్లా అధికారుల కమిటీ ధర నిర్ణయించింది. వాటి ధరను ఫైనలైజ్ చేయడానికి కలెక్టర్ షాన్‌మోహన్ కేంద్రంలో ఉన్న డీపీఐఐటీలో ఉన్నతాధికారులను సంప్రదిస్తారు. రాష్ట్ర ప్రభుత్వం వీటిని సాల్ట్ కమిషన్ నుంచి కొనుగోలు చేసి జిల్లాలో పారిశ్రామిక అవసరాలకు వినియోగించే ఆస్కారం ఉంది. ఈ నేపథ్యంలో కలెక్టర్ ఉప్పు భూములకు సంబంధించిన నివేదికను తన వెంట తీసుకెళ్తున్నారు.

ఎప్పటికి పూర్తయ్యేనో?

- నాలుగు లైన్ల రోడ్డు విస్తరణ పనుల్లో జాప్యం
- రాక్ సిరామిక్, అచ్చంపేట సెంటర్ పనుల్లో వేగం
- అచ్చంపేట సెంటర్ నుంచి పోర్టు వరకు పనుల్లో అనిశ్చితి
- అసంపూర్తి నిర్మాణాలతో ప్రయాణికుల ఇక్కట్లు



నిర్మాణం పూర్తయిన పెద్దాపురం రాక్ సిరామిక్ నుంచి సామర్లకోట వైపు సుదూర ఓవర్ ఫ్లైఓవర్ బ్రిడ్జి

సర్పవరం జంక్షన్, నవంబరు 23(ఆంధ్రజ్యోతి): కాకినాడ పోర్టు నుంచి పెద్దాపురం రాక్ సిరామిక్ వరకు 26 కిలోమీటర్ల వరకు నాలుగు లైన్ల రహదారి నిర్మాణపనులు నత్తనడకన సాగుతున్నాయి. పారిశ్రామికాభివృద్ధిలో భాగంగా సువిశాలమైన రహదారి రోడ్డు కనెక్టివిటీకోసం కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు చర్యలు తీసుకుంటున్నాయి.

కాకినాడ సముద్రతీరం కేంద్రంగా అజాదీ కా అమృత్ మహోత్సవ్‌లో భాగంగా గతిశక్తి పథకం కింద రోడ్డు విస్తరణ పనులకు రూ.557కోట్ల నిధులు మంజూరు చేసింది. ముఖ్యంగా రెండు ప్యాకేజీలకింద నిర్మాణపనులు 2022, డిసెంబరులో ప్రారంభించింది. ఇందులో మొదటి ప్యాకేజీ కింద కాకినాడ రూరల్ మండలం అచ్చంపేట సెంటర్‌నుంచి పెద్దాపురం రాక్ సిరామిక్ వరకు 12.25 కిలోమీటర్ల మేర నాలుగు లైన్ల రోడ్డు నిర్మాణం, విస్తరణ పనులు, పీయూవోలు, ఫ్లైఓవర్ల బ్రిడ్జిల నిర్మాణ పనులను చేపట్టిన ఆర్‌వీఎన్ఎల్ సంస్థ నిర్మాణ పనులు వేగంగా సాగుతున్నాయి. రెండో ప్యాకేజీ కింద అచ్చంపేట సెంటర్ నుంచి కాకినాడ యాంకరేజి పోర్టు వరకు 10కిలోమీటర్ల మేర రోడ్డు విస్తరణ పనులు టెండర్ దక్కించుకున్న ఆర్‌కే ఇన్‌ఫ్రా కంపెనీ ఆధ్వర్యంలో పనులు నత్తనడకన సాగుతున్నాయి. ఈ రహదారిలో 20శాతం మేర కూడా పనులు పూర్తవలేదు. నాలుగు లైన్ల రహదారి విస్త రణ పనులు చేపట్టిన కాంట్రాక్ట్ సంస్థ సూర్యారావుపేట, లైట్ హౌస్, కొత్తూరు, పాముగుంట రహదారిలో అసంపూర్తిగా నిర్మాణ పనులు నిలిచిపోవడంతో వాహనదారులు ఇబ్బందులకు గురవుతున్నారు.

పారిశ్రామిక ప్రాంత అభివృద్ధికి తోడ్పాటు

కాకినాడ యాంకరేజిపోర్టు, డీప్‌వాటర్ పోర్టులకు రాష్ట్రంలోని ఇతర జిల్లాల నుంచే ఇతర రాష్ట్రాలనుంచి నిత్యం వందలాది భారీ వాహనాలు గ్రానైట్ రాళ్లు, ఐరన్ ఓర్, సిమెంట్, బియ్యం, నూకలు వంటివి సామర్లకోట నుంచి కాకినాడ పోర్టు వరకు రోడ్డు మీదుగా రాకపోకలు సాగిస్తుంటాయి. రహదారి విస్తరణ పనుల కోసం రెవెన్యూ అధికారులు అవసరమైన భూమిని గుర్తించి రైతులకు పరిహారం చెల్లించి భూసేకరణ ప్రక్రియ చేపట్టి నేషనల్ హైవే అథారిటీకి అప్పగించారు. కాకినాడ యాంకరేజిపోర్టు నుంచి పెద్దాపురం రాక్‌సిరామిక్ వరకు 26కిలోమీటర్ల మేర రోడ్డు ఆధునికీకరణ, ఆర్వోబీలు, రోడ్డు కమ్ బ్రిడ్జిలు, పీయూవోల నిర్మాణం చేపట్టారు. నాలుగు లైన్ల విస్తరణ పనుల కోసం రెండు ప్యాకేజీలుగా నిర్ణయించిన అధికారులు టెండర్ల ద్వారా కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థ రైల్వేవికాస్ నిగమ్ లిమిటెడ్(ఆర్‌వీఎన్ఎల్) సంస్థకు ప్యాకేజీ-1 కింద రూ.408కోట్లతో 12.2 కిలోమీటర్ల మేర అచ్చంపేట సెంటర్ నుంచి పెద్దాపురం రాక్‌సిరామిక్ వరకు రోడ్డు విస్తరణ పనులు అప్పగించారు. ప్యాకేజీ-2కింద రూ.149కోట్లతో 10 కిలోమీటర్ల మేర కాకినాడ రూరల్ మండలం అచ్చంపేట సెంటర్ ఏడీబీ రోడ్డు నుంచి కాకినాడ యాంకరేజి పోర్టు వరకు ఆర్‌కే ఇన్‌ఫ్రా కంపెనీకి టెండర్ ద్వారా అప్పగించారు.

పనుల జోరు.. కానీ నత్తే నయం

ప్యాకేజీ-1 కింద నాలుగు లైన్ల రోడ్డు విస్తరణ పనులు చేపట్టిన ఆర్‌వీఎన్ఎల్ సంస్థ ఆధ్వర్యంలో 2022, డిసెంబరులో పనులు ప్రారంభించారు. పెద్దాపురం రాక్‌సిరామిక్ నుంచి కాకినాడ రూరల్ అచ్చంపేట సెంటర్ వరకు నాలుగు లైన్ల రోడ్డు విస్తరణ పనులు 80శాతం మేర పూర్తికావచ్చాయి. రాక్ సిరామిక్ నుంచి సామర్లకోట బైపాస్ కెనాల్‌రోడ్డు మీదుగా భీమేశ్వరస్వామి ఆలయం వెనకాల నుంచి ముత్యాలమ్మతల్లి పక్క నుంచి నాలుగులైన్ల నిర్మాణ పనులు పూర్తయ్యాయి. 3.6కిలోమీటర్లు మేర రెండు లైన్లు, ముత్యాలమ్మతల్లి గుడి నుంచి రైల్వే ట్రాక్ మీదుగా 5 కిలోమీటర్ల మేర ఫ్లైఓవర్ బ్రిడ్జిల నిర్మాణం పూర్తి కావచ్చింది. సామర్లకోట షుగర్ ఫ్యాక్టరీ వద్ద, ముత్యాలమ్మతల్లి ఆలయం వద్ద రైల్వేట్రాక్ వద్ద స్పాన్ లిఫ్ట్ చేశామని ప్రతినిధులు తెలిపారు. అచ్చంపేట సెంటర్ నుంచి పిఠాపురం ప్రధాన రహదారి మీదుగా అండర్ పాస్ బ్రిడ్జి నిర్మాణం పూర్తిచేశారు. అప్రోచ్ రోడ్డు నిర్మాణం చేపడుతున్నారు. అచ్చంపేట సెంటర్‌నుంచి కాకినాడ యాంకరేజి పోర్టు వరకు నిర్మాణ పనుల టెండర్ దక్కించుకున్న ఆర్‌కే ఇన్‌ఫ్రా కంపెనీ ఆధ్వర్యంలో నిర్మాణ పనులు నత్తనడకన సాగుతున్నాయి. ఆరు నెలలుగా నిర్మాణ పనులన్నీ నిలుపుదలతో రోడ్డు విస్తరణ పనుల నిర్మాణం అటకెక్కింది. ఈ రహదారిలో కొంతమేర రోడ్డు విస్తరణ పనులు చేపట్టడం, చిన్న మైనర్ బ్రిడ్జిల నిర్మాణం తప్పించి మేజర్ పనులు మొదలుపెట్టకపోవడంతో 2025, డిసెంబరు నాటికి ఈ రహదారిని ప్రారంభించాలన్న ప్రభుత్వ లక్ష్యం నెరవేరే అవకాశం కనిపించడం లేదు.

ఆలయం వద్ద భోజనాలకు వెళ్లొస్తూ మృత్యుఒడికి...



గొల్లప్రోలు బైపాస్‌రోడ్డు జంక్షన్ వద్ద ఆర్టీసీ బస్సు చక్రాల కింద మోటార్‌సైకిల్

ఎదురెదురుగా ఢీకొన్న మోటార్‌సైకిల్, ఆర్టీసీ బస్సు

ఒకరు మృతి... మరొకరికి తీవ్రగాయాలు

కాకినాడ జిల్లా గొల్లప్రోలు వద్ద ఘటన



సంఘటనా స్థలంలో మరణించిన కృష్ణారావు, తీవ్రంగా గాయపడిన శ్రీను

గొల్లప్రోలు, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): అమ్మవారి ఆలయం వద్ద జరిగిన భోజనాలకు వెళ్లి వస్తూ గొల్లప్రోలు వద్ద ప్రమాదానికి గురై ఒకరు చనిపోగా మరొకరికి తీవ్రగాయాలయ్యాయి. కాకినాడ జిల్లా పిఠాపురం మండలం నరసింగపురం గ్రామానికి చెందిన ఉంద్రు కృష్ణారావు అలియాస్ రాజు(40) బైపాస్‌రోడ్డులో గల భగవాన్ గోపాల్‌బాబా ఆశ్రమంలో వంట పనిచేస్తున్నాడు. పిఠాపురం జగ్గయ్యచెరువు కాలనీలో ఉంటున్న గంధం శ్రీను(40)తో కలిసి గొల్లప్రోలు మండలం చేబ్రోలు శివారు సత్తెమ్మ తల్లి ఆలయం వద్ద జరిగిన భోజనాలకు వెళ్లారు. అనంతరం మోటార్‌సైకిల్‌పై తిరిగి పిఠాపురం వస్తున్నారు. గొల్లప్రోలు బైపాస్‌రోడ్డు నుంచి 216వ జాతీయ రహదారికి వెళ్లే జంక్షన్ వద్దకు వచ్చేసరికి కాకినాడ నుంచి తుని వెళ్తున్న ఆర్టీసీ బస్సు పట్టణంలో నుంచి ఎన్‌హెచ్‌పైకి వస్తుండగా ఎ దురెదురుగా ఢీకొన్నాయి. మోటార్‌సైకిల్ ఆర్టీసీ బస్సు చక్రం కింద ఇరుక్కుపోయింది. ఈ సంఘటనలో ఉంద్రు కృష్ణారావు అక్కడికక్కడే మరణించాడు. శ్రీనుకి తీవ్ర గాయాలు కాగా పిఠాపురం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. హైవే మొబైల్, గొల్లప్రోలు పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించారు.



బుసలు కొడుతున్న తాచుపాము



పామును డబ్బాలో బంధించిన గణేష్‌వర్మ

పి.గన్నవరంలో తాచుపాము హల్‌చల్

పి.గన్నవరం, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా పి.గన్నవరం ప్రభుత్వాసుపత్రి ఎదుట మన్నే వెంకట సత్యనారాయణమూర్తి నివాసంలో ఆదివారం తాచుపాము హల్‌చల్ చేసింది. పామును స్నేక్ క్యాచర్ గణేష్‌వర్మ పట్టుకున్నాడు. ఈ పాముకు సుమారు 20 ఏళ్ల వయస్సు ఉంటుందని తెలిపాడు. రక్తపింజరం జాతి పాములతో అప్రమత్తంగా ఉండాలని సూచించాడు. తాను డబ్బాలో బంధించిన పాములను జనావాసాలు లేని చోట వదులుతానని గణేష్‌వర్మ తెలిపాడు.

పాపికొండలకు పర్యాటకులు..

వీఆర్‌పురం, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): పాపికొండల విహారానికి 600 మంది పర్యాటకులు 10 పర్యాటక బోట్లలో వెళ్లారు. ఆదివారం సెలవు కావడంతో ఆంధ్రా, తెలంగాణ రాష్ట్రాల నుంచి పాపికొండలు-పేరంటాలపల్లి ప్రకృతి అందాలను తిలకించేందుకు ఎక్కువమంది తరలివచ్చారు. గోదావరిలో బోట్లలో వెళ్లడం ఎంతో ఆనందాన్ని కలిగించిందని పర్యాటకులు తెలిపారు. ముందుగా పేరంటాలపల్లి చేరుకుని మునిమఠం, శివాలయాన్ని దర్శించుకున్నారు. తర్వాత పాపికొండలకు బయలుదేరి ప్రకృతి అందాలను చూసి ఆనందం పొందారు.



పోచవరం ఫెర్రి పాయింట్ దగ్గర పర్యాటకుల సందడి

స్నేహితులతో సరదాగా బీచ్‌కు వెళ్లి...

సముద్రంలో బాలుడి గల్లంతు

పోలీసుల గాలింపు చర్యలు



మహిమరాజు (ఫైల్)

మలికిపురం, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): స్నేహితులతో సరదాగా బీచ్‌కు వెళ్లిన బాలుడు సముద్రంలో గల్లంతయ్యాడు. వివరాల ప్రకారం.. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా మలికిపురం మండలం మోరి అరుంధతి పేట గ్రామానికి చెందిన మహిమరాజు (14) అలియాస్ బబ్లూ 9వ తరగతి వరకు చదివి ఒక ప్రైవేటు స్కూలు బస్సు క్లీనర్‌గా పనిచేసేవాడు. స్కూలు యాజమాన్యం జీతాలు సరిగా ఇవ్వకపోవడంతో ఆ పని కూడా మానేసి ఖాళీగా ఉంటున్నాడు. ఆదివారం తన స్నేహితులు చుట్టుగుళ్ల ముకేష్, వాస్కూరి సూర్యగణేష్, కొప్పాడి రాకేష్‌తో కలసి చింతలమోరి బీచ్‌కు వెళ్లాడు. వారంతా ఇసుక తిన్నెలపై ఆటలాడుకుని ఫొటోలు తీసుకున్నారు. త ర్వాత బబ్లూ, ముకేష్ స్నానానికి దిగారు. కెరటాలు ఉధృతంగా రావడంతో బబ్లూ సముద్రంలో కొట్టుకుపోయాడు. ముకేష్ ఇచ్చిన సమాచారంతో బంధువులు, పోలీసులు గాలింపు చర్యలు చేపట్టారు. బబ్లూ తండ్రి రమేష్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ బి.సురేష్ తెలిపారు. రాజోలు ఎమ్మెల్యే దేవ వరప్రసాద్ సంఘటనపై ఆరా తీశారు. పోలీసులతో మాట్లాడి తగు చర్యలు వెంటనే తీసుకోవాలని ఆదేశించారు. కాగా సూర్యగణేష్, ముకేష్, రాకేష్ మోరి జిల్లా పరిషత్ హైస్కూలులో పదో తరగతి చదువుతున్నారు. బాలుడు గల్లంతుకా వడంతో మోరి అరుంధతి పేటలో విషాదచాయలు అలుముకున్నాయి.

విహారయాత్రలో విషాదం

సోకిలేరు వాగులో మునిగి విజయవాడకు చెందిన జిమ్ ట్రైనర్ మృతి



మృతిచెందిన సందీప్ (ఫైల్)

చింతూరు/మోతుగూడెం, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): అల్లూరి జిల్లా చింతూరు మండలం మోతుగూడెం పోలీసుస్టేషను పరిధిలోని సోకిలేరు వాగులో మునిగి జిమ్ ట్రైనర్ కె.సందీప్ (30) మృతిచెందాడు. మోతుగూడెం ఎస్ఐ ఎస్కే. సాధిక్ తెలిపిన వివరాల ప్రకారం... విజయవాడకు చెందిన 13మంది స్నేహితులు 3 కార్లలో ఆదివారం ఉదయం విహారయాత్రకు మారేడుమిల్లి వచ్చారు. మధ్యాహ్నం 2గంటల సమయంలో చింతూరు మండలం సోకిలేరు వ్యూ పాయింట్ పరిసర ప్రాంతాలకు వచ్చారు. సోకిలేరు వాగు ఒడ్డున వంట తయారీ పనిలో కొంతమంది నిమగ్నమయ్యారు. వారిలో ఒకరైన నరేంద్ర ముందుగా వాగులో స్నానం చేసి తిరిగి ఒడ్డుకు వచ్చాడు. తదుపరి జిమ్‌ట్రైనర్ అయిన కె.సందీప్ స్నానానికి వాగులో దిగాడు. కొద్దిదూరం ఈతకొట్టి తిరిగి ఒడ్డుకు చేరే క్రమంలో నీటిలో మునిగిపోయాడు. స్నేహితుడు మునిగిపోతున్న విషయం గుర్తించిన మిగిలిన వారంతా సందీప్‌ని రక్షించే ప్రయత్నం చేశారు. అయినప్పటికీ ఫలితం లేకుండా పోయింది. చివరకు సందీప్ ప్రాణాలు వదలగా మృతదేహాన్ని ఒడ్డుకు చేర్చారు. అక్కడి నుంచి చింతూరు ఏరియా ఆసుపత్రికి అంబులెన్సు సహకారంతో తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్టు ఎస్ఐ తెలిపారు. కాగా ఈ 13 మందిలో నలుగురు జిమ్ ట్రైనర్లు ఉన్నారు.



ఖోఖో పోటీల్లో తలపడుతున్న క్రీడాకారులు

ఉల్లాసంగా.. ఉత్సాహంగా...

కాకినాడలో రెండో రోజు

అంతర్ జిల్లాల ఖోఖో పోటీలు

కార్పొరేషన్(కాకినాడ), నవంబరు 23(ఆంధ్రజ్యోతి): పాఠశాల క్రీడాసమాఖ్య అండర్-14, 17 ఆధ్వర్యంలో కాకినాడ డీఎస్ఏలో రెండోరోజు రాష్ట్రస్థాయి ఎస్ఏఎఫ్ఏ అంతర్ జిల్లాల బాలుర ఖోఖో పోటీలు ఆదివారం ఉల్లాసంగా జరిగాయి. ప్రకాశం, చిత్తూరు, విశాఖ, గుంటూరు జిల్లాల క్రీడాకారులు పోటీపడ్డారు. రాష్ట్ర ఖోఖో సంఘ కార్యదర్శి సీతారామ రెడ్డి, కోశాధికారి ఎల్.గోవిందరాజు, కాకినాడ జిల్లా పీఈటీ సంఘ అధ్యక్షుడు శ్రీనివాస్, కార్యదర్శి మాచరరావు, టోర్నమెంట్ నిర్వహణా కార్యదర్శి కె.శ్రీనివాస్, సంయుక్త కార్యదర్శి పట్టాభి, ఎస్‌కేడీఎస్ స్కూల్ ఛైర్మన్ ప్రభువర ప్రసాద్, గంగనాపల్లి మాజీ ప్రసిడెంట్ నాగబాబు, ఖోఖో కోచ్ వాసులు పోటీలను తిలకించి పర్యవేక్షించారు. సానా సతీష్ బాబు ఫౌండేషన్ ఛైర్మన్ తలాటం హరిష్ అందించిన టీ షర్టులను ఆవిష్కరించారు. క్వాటర్ ఫైనల్స్‌లో తూర్పుగోదావరి జిల్లాపై విశాఖ జిల్లా 3 పాయింట్ల తేడాతోను, నెల్లూరుపై గుంటూరు ఒక పాయింట్ తేడాతోను, విజయనగరంపై చిత్తూరు 3 పాయింట్ల తేడాతోను, కర్నూలుపై ప్రకాశం 10 పాయింట్ల తేడాతో గెలుపొందాయి. పోటీల నిర్వహణలో పీడీలు, పీఈటీలు సహకారం అందించారు. జిల్లా వైద్య ఆరోగ్య శాఖ నుంచి ప్రథమ చికిత్స శిబిరం నిర్వహించారు.

జుడో పోటీలు

కాకినాడ జిల్లా జుడో సంఘం ఆధ్వర్యంలో రాష్ట్రస్థాయి సీనియర్స్ జుడో పోటీలు కాకినాడ డీఎస్ఏ ఇండోర్ స్టేడియంలో ఆదివారం రెండో రోజు ఉత్సాహంగా జరిగాయి. బాలురు, బాలికల విభాగంలో నిర్వహిస్తున్న పోటీల్లో 7 వెయిట్ కేటగిరిల్లో బాలికలకు, బాలురకు నిర్వాహకులు పోటీలు నిర్వహించారు. బాలికల పోటీలను రాష్ట్ర సంఘ సీఈవో వెంకట్, బాలుర పోటీలను జుడో సంఘ ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా ట్రెజరర్ రమణ ప్రారంభించారు. పోటీల్లో ప్రతిభ చూపిన క్రీడాకారుల నుంచి జాతీయస్థాయి పోటీలకు రాష్ట్రజట్టును ఎంపిక చేయనున్నారు. జాతీయస్థాయి పోటీలు మణిపూర్‌లో డిసెంబరు 11 నుంచి 15 వరకు జరుగుతాయి. కాకినాడ జుడో సంఘ ఛైర్మన్ వెంకట కృష్ణారావు, డిసిప్లేన్ కమిటీ కాజా మస్తాన్, టోర్నమెంట్ పరిశీలకులు పివి.తేజ, కార్యదర్శి పవన్ సందీప్, గోవిందు, రామకృష్ణ, స్టేట్ జాయింట్ సెక్రటరీ గమిడి శ్రీనివాసరావు, ఉషరాణి పోటీలను పర్యవేక్షించారు. విజేతలకు కాకినాడ రూరల్ ఎమ్మెల్యే పంతం నానాజీ ముఖ్యఅతిథిగా విచ్చేసి బహుమతులు అందించారు. డీఎస్ఏ జుడో కోచ్, క్రీడాకారులు, కోచ్లు, మేనేజర్లు పాల్గొన్నారు.



జుడో పోటీల్లో తలపడుతున్న క్రీడాకారులు

కాకినాడ జీజీహెచ్‌కు నేడు డీఎంఈ రాక

జీజీహెచ్ (కాకినాడ), నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): వైద్యుల నిర్లక్ష్యంతో గర్భిణి మృతిచెందిన ఘటనలో ప్రభుత్వ ఆదేశాల మేరకు విచారణ నిర్వహించేందుకు రాష్ట్ర వైద్య సంచాలకుడు (డీఎంఈ) డాక్టర్ జి.రఘునందన్ సోమవారం కాకినాడ జీజీహెచ్‌కు రానున్నారు. విచారణ నిర్వహించాలని వైద్య,ఆరోగ్య శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ సౌరభ్‌గౌర్ ఆదేశించిన నేపథ్యంలో నిర్వహించేందుకు సమాయత్తమయ్యారు. ఘటన జరిగిన కారణాలతో పాటు దారితీసిన పరిస్థితులపై ఆరా తీయనున్నారు. విచారణానంతరం ఈ నివేదికను ప్రభుత్వానికి సమర్పిస్తారు.

జాతీయస్థాయి క్రీడా పోటీలకు వ్యాయామ ఉపాధ్యాయుల ఎంపిక



ఎంపికైన ఉపాధ్యాయులు

ఎటపాక, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): జాతీయస్థాయి క్రీడా పోటీలకు అల్లూరి జిల్లా ఎటపాక మండలం నల్లకుంట గిరిజన ఆశ్రమ ఉన్నత పాఠశాలలో పని చేస్తున్న పీడీ సొడే నాగిరెడ్డి, సీతాపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పనిచేస్తున్న పీఈటీ పెనుబల్లి లక్ష్మణ్‌రావు ఎంపికయ్యారు. గుంటూరు ఆచార్య నాగార్జున యూనివర్సిటీలో నిర్వహించిన రాష్ట్రస్థాయి క్రీడా పోటీల్లో వీరిద్దరు ప్రతిభ కనబర్చారు. పీడీ నాగిరెడ్డి షాట్‌పుట్‌లో ప్రథమస్థానంతోపాటు వందమీటర్ల పరుగు పందెంలో తృతీయస్థానంలో నిలిచారు. పీఈటీ పెనుబల్లి లక్ష్మణ్‌రావు వందమీటర్ల పరుగుపందెంలో ప్రథమస్థానం తోపాటు లాంగ్ జంప్‌లో ద్వితీయస్థానంలో నిలిచారు. దీంతో బీహార్ రాజధాని పాట్నాలో వచ్చే నెల 13 నుంచి 15 వరకు జరిగే జాతీయస్థాయి ఉద్యోగస్తుల క్రీడా పోటీల్లో ఇద్దరు పాల్గొననున్నారు.

యువకుడికి తీవ్ర గాయాలు

రాజవొమ్మంగి నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): అల్లూరి జిల్లా రాజవొమ్మంగిలో ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో యువకుడికి తీవ్ర గాయలయ్యాయి. రాజవొమ్మంగికి చెందిన బైరున్ అబ్దుల్ ద్విచక్రవాహనంపై సూరంపాలెం వైపు హైవేపై వెళ్తుండగా రాజవొమ్మంగి గ్రామశివారులో టాటా ఏస్ వాహనాన్ని ఢీకొన్నాడు. దీంతో అబ్దుల్‌కు తీవ్ర గాయాలయ్యాయి. రాజవొమ్మంగి ప్రభుత్వాసుపత్రికి, ఆపై కాకినాడ ఆసుపత్రికి తరలించారు.

కూరగాయల మాటున గంజాయి

రూ.1.67 కోట్ల విలువైన 332.91 కిలోల గంజాయి, 4 సెల్‌ఫోన్లు స్వాధీనం

రవాణా చేస్తున్న నలుగురి అరెస్ట్... రిమాండ్‌కు తరలింపు : డీఎస్పీ విద్య



నిందితుల వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ విద్య

రాజమహేంద్రవరం, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): కూరగాయల ట్రేల మధ్య గుట్టు చప్పుడు కాకుండా రవాణా చేస్తున్న గంజాయిని పోలీసులు స్వాధీనం చేసుకుని నలుగురిని అరెస్ట్ చేశారు. ఈ వివరాలను ఆదివారం డీఎస్పీ విద్య వెల్లడించారు. తూర్పుగోదావరి జిల్లా బొమ్మూరు పోలీస్‌స్టేషన్ ఎస్ఐ ఆర్.మురళీమోహన్‌కి గంజాయి రవాణాపై విశ్వసనీయ సమాచారం అందింది. దీని ఆ ధారంగా శనివారం సాయంత్రం జీరో పాయింట్ వద్ద వాహన తనిఖీలను చేస్తుండగా రాజానగరం వైపు నుంచి వచ్చిన వ్యాను, కారులోని వ్యక్తులు అనుమానాస్పదంగా ప్రవర్తించారు. దీంతో ఆ వాహనాలను క్షుణ్ణంగా తనిఖీ చేశారు. వ్యానులోని కూరగాయల ట్రేల మధ్యలో 12 గంజాయి మూటలు, కారు డిక్కీలో ఒక గంజాయి మూటను గుర్తించారు. వాటిలో రూ.1.67 కోట్లు విలువైన 332.91 కిలోల గంజాయి ఉంది. ఆ గంజాయితో పాటు రూ.4.5 లక్షల విలువైన 4 సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నామని డీఎస్పీ తెలిపారు. గంజాయిని ఒడిశాలోని బరంపురంలో రాము అనే వ్యక్తి వద్ద కొనుగోలు చేసి కర్నాటక తీసుకెళ్తున్నారని చెప్పారు. ఈ కేసులో కర్నాటకలోని చిక్‌బళ్లాపూర్ జిల్లా గౌరీబిదనూర్ మండలానికి చెందిన ఇస్మాయిల్ షరీఫ్, ముస్తాన్ ఆలీఖాన్, మన్సూర్, తుమకూరు జిల్లా హుగాడ కాలనీకి చెందిన సుల్తాన్ సలీంని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించామని, షరీఫ్‌పై కర్నాటకలోగంజాయి కేసులున్నాయన్నారు.

తాబేళ్లు తరలిస్తున్న వ్యక్తి అరెస్ట్



నిందితుడితో ఫారెస్ట్ పోలీసులు

మోతుగూడెం, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): అల్లూరి జిల్లా చదలవాడ పంచాయతీ తులసిపాక ఫారెస్ట్ చెక్‌పోస్ట్ వద్ద తాబేళ్లు తరలిస్తున్న వ్యక్తిని పోలీసులు పట్టుకున్నారు. ఆదివారం మధ్యాహ్నం 3 గంటలకు ఫారెస్ట్ చెక్‌పోస్ట్ వద్ద ఫారెస్ట్ సెక్షన్ ఆఫీసర్ విజయకుమార్, ఫారెస్ట్ హెల్పర్ వాహనాలు తనిఖీలు చేస్తుండగా టిప్పర్ ఆటోలో 8 గోనె సంచులతో 248 తాబేళ్లు తీసుకెళ్తుండగా పట్టుకున్నారు. నెల్లూరి విశాఖ అనే వ్యక్తి రావులపాలెం నుంచి ఒడిస్సా రాష్ట్రం తీసుకెళ్తున్నాడని, 248 తాబేళ్లకు 230 బతికున్నాయని 18 చనిపోయాయని విజయకుమార్ పేర్కొన్నారు. నిందితుడిని కోర్టు తలిస్తామని తెలిపారు.

పల్ల వెంకన్న నర్సరీని సందర్శించిన ఐజీ హరికృష్ణ

కడియం, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): తూర్పుగోదావరి జిల్లా కడియంలో పల్ల వెంకన్న నర్సరీని ఐజీ (స్పెషల్) హరికృష్ణ సందర్శించారు. నర్సరీ రైతులు పల్ల వెంకటేష్, వినయ్ ఆయనకు స్వాగతం పలికారు. కుటుంబ సభ్యులతో కలిసి నర్సరీని సందర్శించిన హరికృష్ణ నర్సరీలో వివిధ రకాల మొక్కలు చూశారు. నర్సరీ పచ్చని అందాలతో ఉందని, కొత్త రకాల మొక్కలు, నర్సరీ నిర్వహణ చూసి ఐజీ ప్రశంసించారు. గతంలో జిల్లా ఎస్పీగా పనిచేసిన సమయంలో నర్సరీ రైతులతో ఉన్న అనుబంధాన్ని గుర్తు చేశారు. జిల్లా స్పెషల్ బ్రాంచి డీఎస్పీ రామకృష్ణ, కడియం సీఐ ఏ.వెంకటేశ్వరరావు, ఎస్‌బీ జనార్ధన్ పాల్గొన్నారు.



ఐజీ హరికృష్ణకు మొక్క అందజేస్తున్న పల్ల వెంకన్న నర్సరీ రైతులు

ఆలయాల్లో చోరీలు.. దొరికిన దొంగలు!

బంగారం, వెండి వస్తువులు, ఆటో, మోటార్‌సైకిల్ స్వాధీనం



స్వాధీనం చేసుకున్న బంగారం, వెండి వస్తువులు



పట్టుబడిన నిందితులతో పోలీసులు

గోకవరం, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): తూర్పుగోదావరి జిల్లా గోకవరం మండలం లోని 2 ఆలయాల్లో చోరీకి పాల్పడిన ఇద్దరిని ఆదివారం అరెస్ట్ చేసినట్టు ఎస్ఐ పవన్ కుమార్ తెలిపారు. గోకవరం మండలం కొత్తపల్లిలో రాజలింగేశ్వరస్వామి ఆలయంలో సెప్టెంబరు 16న, గోకవరం గ్రామ శివారున ఉన్న గంగాలమ్మతల్లి గుడి ఆలయంలో అక్టోబరు 21న గుర్తు తెలియని వ్యక్తులు చోరీకి పాల్పడ్డారు. ఈ మేరకు అందిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి నిందితుల కోసం గాలింపు చేపట్టారు. చివరకు నిందితులను గుర్తించి అరెస్ట్ చేశారు. అల్లూరి సీతారా మరాజు జిల్లా ఎటపాక మండలం తుమ్మల నగరం గ్రామానికి చెందిన పేరాల నరసింహరావు, పురుషోత్తపట్నం గ్రామానికి చెందిన గుండి జగదీష్‌ను అరెస్ట్ చేసినట్టు ఎస్ఐ తెలిపారు. వారి నుంచి 12 గ్రాముల బంగారం శతమానాలు, సుమారు కిలో వెండి వస్తువులు, ఆటో, మోటార్‌సైకిల్, హుండీలో దొంగి లించిన రూ.2,000 చిల్లరను స్వాధీనం చేసు కున్నామన్నారు. నిందితులు గోకవరంతో పాటు రాజానగరం, రంపచోడవరం పరిసర ప్రాంతాల్లో కూడా నేరాలు చేసినట్టు చెప్పారు.

అయినవిల్లిలో ఉన్నతాధికారుల పూజలు



రాష్ట్ర ముఖ్య కార్యదర్శి విజయానంద్‌కు చిత్రపటం అందజేస్తున్న ఈవో



ఆలయంలో అధికారులకు వేదాశీర్వచనం అందిస్తున్న అర్చకులు

అయినవిల్లి, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాలో ప్రసిద్ధి చెందిన అయినవిల్లి శ్రీ సిద్ధివినాయక దేవస్థానానికి రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి విజయానంద్ ఆదివారం విచ్చేసి స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. 108 కొబ్బరికాయల మొక్కు తీర్చుకున్నారు. అలాగే కోనసీమ జిల్లా కలెక్టర్ రావిరాల మహేష్‌కుమార్, తూర్పుగోదావరి జిల్లా కలెక్టర్ చేకూరి కీర్తి, కోనసీమ జిల్లా ఎస్పీ రాహుల్ మీనా స్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. ఆలయ సహాయ కమిషనర్ ముదునూరి సత్యనారాయణ రాజు ఆధ్వర్యంలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి విజయానంద్, అధికారులకు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. ప్రధానార్చకులు అధికారులకు వేదాశీర్వచనం అందజేసి శేషవస్త్రంతో సత్కరించి స్వామివారి చిత్రపటం, ప్రసాదాలను అందజేశారు. విజయానంద్ మాట్లాడుతూ దేవస్థాన నిర్వహణ, పూజా విధులకు సంబంధించి ప్రభుత్వపరంగా పూర్తి సహకారం అందిస్తామన్నారు. కొత్తపేట డీఎస్పీ సుంకర మురళీమోహన్, తహశీల్దార్ విద్యాపతి పాల్గొన్నారు.

సత్యదేవుడికి ఎస్టీ కమిషన్ ఛైర్మన్ పూజలు



రథంపై విహరిస్తున్న సత్యదేవుడు,అనంతలక్ష్మి అమ్మవార్లు



సత్యదేవుడి దర్శనానంతరం ఎస్టీ కమిషన్ ఛైర్మన్ బొజ్జిరెడ్డి

అన్నవరం, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లాలో ప్రముఖ పుణ్యక్షేత్రమైన అన్నవరం సత్యదేవుడి సన్నిధిలో ఆదివారం రాష్ట్ర ఎస్టీ కమిషన్ ఛైర్మన్ ఎస్.బొజ్జిరెడ్డి కుటుంబసభ్యులతో స్వామిని దర్శించి ప్రత్యేకపూజలు నిర్వహించారు. ఆయనకు ఆలయ అధికారులు ఆలయ మర్యాదలతో ఘనస్వాగతం పలికారు. దర్శనానంతరం వారికి ఆలయ వేదపండితులు వేదాశీర్వచనం అందజేశారు.

ఘనంగా రథోత్సవం

సత్యదేవుడికి వారాంతపు ఆర్జితసేవయిన రథోత్సవం ఆదివారం ఘనంగా జరిగింది. ఉదయం 10గంటలకు స్వామి,అమ్మవార్లను ప్రధానాలయం నుంచి తూర్పురాజగోపురం వద్ద ఉంచిన రథం వద్దకు బాజాభజంత్రీలతో తోడ్కొనివచ్చారు. ప్రత్యేక పూజల అనంతరం భక్తుల గోవి ందనామస్మరణలు, పండితుల మంత్రోచ్చరణల నడుమ ముమ్మారు తూర్పురాజగోపురం చుట్టూ ప్రదక్షిణ గావించారు. అనంతరం హారతులిచ్చి ప్రధానాలయానికి తీసుకెళ్లారు.

ఉత్తమ ఫలితాల సాధనకు ప్రధానోపాధ్యాయుల కృషి

ఎమ్మెల్యే నానాజీ, ఎమ్మెల్సీ రాజశేఖరం

75 వసంతాల ఏపీహెచ్‌ఎంఏ లోగో ఆవిష్కరణ



ఏపీహెచ్‌ఎంఏ లోగోను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్సీ పేరాబత్తుల రాజశేఖరం

సర్పవరం జంక్షన్, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): విద్యారంగంలో ప్రభుత్వం కీలక సంస్కరణలు తీసుకొచ్చిందని, నాణ్యమైన విద్యా బోధన అందిస్తూ ఉత్తమ ఫలితాలు సాధించడంలో ప్రధానోపాధ్యాయుల కృషి ఎంతో ఉందని కాకినాడ రూరల్ ఎమ్మెల్యే పంతం నానాజీ, గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ పేరాబత్తుల రాజశేఖరం పేర్కొన్నారు. ఆంధ్రప్రదేశ్ హెడ్‌మాస్టర్స్ అసోసియేషన్ (ఏపీహెచ్‌ఎంఏ) రాష్ట్ర అధ్యక్షుడు చెవ్వూరి రవి అధ్యక్షతన ఆదివారం కాకినాడ రెవెన్యూ భవన్‌లో నిర్వహించిన 75వ వార్షికోత్సవ వేడుకలకు వారు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఏపీ ప్రధానోపాధ్యాయుల సంఘం ఏర్పడి 75 వసంతాలు పూర్తి చేసుకోవడం, ఇందులో భాగస్వాములుగా ఉండడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. ప్రధానోపాధ్యాయుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తామని హామీఇచ్చారు. క్లస్టర్ ప్రధానోపాధ్యాయుని పోస్టుని గ్రేడ్-1గా ఉద్యోగోన్నతి కల్పించి డీడీవోగా చేయాలని, డైట్ సీనియర్ లెక్చరర్, సెక్టోరల్, సమగ్ర శిక్షాలో ఏపీసీ పోస్టుల్లో సీనియర్ హెచ్‌ఎంలను నియమించాలని, ప్లస్ 2 పాఠశాలలను బలోపేతం చేయాలని, స్కూల్ అసిస్టెంట్లకు పీజీటీలుగా, హెచ్ ఎంలకు ప్రిన్సిపాల్స్‌గా ఉద్యోగోన్నతి కల్పించాలని తీర్మానం చేశారు. 75 వసంతాల ఏపీహెచ్‌ఎంఏ లోగోని ఆవిష్కరించారు. సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జి.శ్రీనివాసరావు, ఉపాధ్యక్షుడు కె.సత్యనారాయణ, కాకినాడ, కోనసీమ, తూర్పుగోదావరి జిల్లాల అధ్యక్షులు కూర్మారావు, మోకా ప్రకాష్, రమణారావు, ప్రధాన కార్యదర్శులు శ్రీధర్, గణేశ్వరరావు, రామారావు పాల్గొన్నారు.

రేపు విద్యుత్ సరఫరాకు అంతరాయం

సర్పవరం జంక్షన్, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): తిమ్మాపురం సబ్ స్టేషన్ పరిధిలో మంగళవారం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఏపీఈపీడీసీఎల్ కాకినాడ ఈఈ ఎన్.ఉదయభాస్కర్ తెలిపారు. అచ్చంపేట 33 కేవీ కొత్త సబ్ స్టేషన్ ఆర్డీఎస్ఎస్ పనుల నిమిత్తం ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు తిమ్మాపురం, పి.వెంకటాపురం, అచ్చంపేట జంక్షన్, రాయుడుపాలెం గోశాల ప్రాంతాలకు సరఫరా ఉండదన్నారు.


రౌండ్‌టేబుల్ సమావేశంలో ఐక్యత చాటుతున్న నాయకులు

'చేనేత పరిశ్రమను ఆదుకోవాలి'

కాకినాడ సిటీ, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): సంక్షోభంలో ఉన్న చేనేత పరిశ్రమను కూటమి ప్రభుత్వం ఆదుకోవాలని రాష్ట్ర చేనేత కులాల సమాఖ్య నాయకులు కోరారు. నగరంలోని రామారావుపేటలో గల బి హబ్ కన్వెన్షన్ హాలులో రాష్ట్ర చేనేత కులాల రౌండ్‌టేబుల్ సమావేశం ఆంధ్రప్రదేశ్ చేనేత కులాల సమాఖ్య రాష్ట్ర కార్యనిర్వాహక కన్వీనర్ పంపన రామకృష్ణ అధ్యక్షతన ఆదివారం జరిగింది. రాష్ట్ర నాయకులు పంపన రామకృష్ణ, అందే జగదీష్, ముప్పన వీర్రాజు, పప్పు రాజారావు, ఆమంచి అంజనేయ గురుస్వామి మాట్లాడుతూ చేనేత సహకార సంఘాలకు పావలా వడ్డీకి రుణాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. చేనేత సహకార సంఘాలకు రావాల్సిన బకాయిలను ప్రభుత్వం తక్షణం విడుదల చేయాలని కోరారు. చేనేతలకు జీఎస్టీ మినహాయింపు ఇచ్చి చేనేత రంగాన్ని ఆదుకోవాలన్నారు. చేనేత కార్మికుల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని రూ.25వేల ప్రోత్సాహకాన్ని వెంటనే అమలు చేయాలన్నారు. ప్రతి మగ్గానికీ 200 యూనిట్లు కరెంటు ఉచితంగా ఇవ్వాలని, జనతా వస్త్ర పథకం ప్రవేశపెట్టి వృత్తిదారులను ప్రోత్సహించాలన్నారు. న్యాయమైన డిమాండ్ల సాధనకు అన్ని సంఘాలు ఐక్యంగా ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. సమావేశంలో వివిధ జిల్లాల నాయకులు అవ్వారు మల్లికార్జున, కర్రి రవి, సుబ్రహ్మణ్యం, శ్రీకృష్ణ, రామయ్య, అధిక సంఖ్యలో చేనేత కార్మికులు పాల్గొన్నారు.


పిఠాపురంలో కలుసుకున్న ఏకేపీఎం స్కూలు పూర్వ విద్యార్థులు

విద్యార్థుల అ'పూర్వ' సమ్మేళనం

పిఠాపురం, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): ఆటపాటలతో సందడి చేస్తూ సరదాగా గడిపారు ఆ పూర్వ విద్యార్థులు, వారి కుటుంబసభ్యులు. పట్టణంలోని ఆంధ్రకేసరి ప్రకాశం పంతులు మున్సిపల్ ఉన్నత పాఠశాల 1983 టెన్త్ బ్యాచ్ విద్యార్థుల 31వ అపూర్వ సమ్మేళనం నరసింగపురం రోడ్డులోని రావులవారి మామిడితోటల్లో ఆదివారం జరిగింది. చిన్ననాటి జ్ఞాపకాలను గుర్తుకు తెచ్చుకున్నారు. ఆటల పోటీలు, సాంస్కృతిక ప్రదర్శనలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. ప్రతిఏటా క్రమం తప్పకుండా ఆత్మీయ సమ్మేళనం నిర్వహిస్తున్న ఆకుల శేషగిరి, జక్కా సురేష్, నాళం రవికుమార్, మామిడాల సత్యకుమార్‌లను పూర్వ విద్యార్థులు అభినందించారు.


సత్యసాయిబాబా చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న సూపరింటెండెంట్ లావణ్యకుమారి

జీజీహెచ్‌లో సత్యసాయిబాబా జయంతి

జీజీహెచ్ (కాకినాడ), నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): పుట్టపర్తి సత్యసాయిబాబా శత జయంతిని కాకినాడ జీజీహెచ్‌లో ఆదివారం నిర్వహించారు. సూపరింటెండెంట్ డాక్టర్ ఎస్.లావణ్యకుమారి సాయిబాబా చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. సాయిబాబా సేవాతత్వాన్ని ఆదర్శంగా తీసుకుని సిబ్బంది బాధ్యతాయుతంగా పని చేయాలని, రోగులకు అందించే సేవలనే ప్రథమ కర్తవ్యంగా భావించాలన్నారు. కార్యక్రమంలో ఆర్ఎంసీ ప్రిన్సిపాల్ డాక్టర్ ఎ.విష్ణువర్ధన్, డాక్టర్ ఎంబీఆర్ శర్మ, డాక్టర్ సీఎస్ఎస్ శర్మ, డాక్టర్ ఎస్వీ రమణమూర్తి, అంకాలజీ హెచ్‌వోడీ డాక్టర్ పద్మనాభన్‌శ్రీనివాసన్, సీఎస్ఆర్ఎంవో డాక్టర్ కోమల తదితరులు పాల్గొన్నారు.

'కాంగ్రెస్ సంస్థాగత నిర్మాణాన్ని బలోపేతం చేస్తాం'



సమావేశంలో మాట్లాడుతున్న ఏఐసీసీ పరిశీలకుడు ఆలీ మేథీ

కాకినాడ సిటీ, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): జిల్లా కమిటీలను మరింత పటిష్టంగా తీర్చిదిద్దడం, పార్టీ శ్రేణుల్లో సమన్వయం పెంచడం, సంస్థాగత నిర్మాణాన్ని బలోపేతం చేయడమే అభియాన్ ప్రధాన ఉద్దేశ్యమని న్యూఢిల్లీ నుంచి వచ్చిన ఏఐసీసీ పరిశీలకుడు ఆలీ మేథీ పేర్కొన్నారు. కాకినాడలోని జిల్లా కాంగ్రెస్ కార్యాలయంలో ఆదివారం సంస్థాగత ఎన్నికల నిమిత్తం పార్టీ శ్రేణులతో సమీక్షించారు. డీసీసీ అధ్యక్షుడు మాదేపల్లి సత్యానందరావు అధ్యక్షత వహించారు. తొలుత ఏర్పాటుచేసిన మీడియా సమావేశంలో పరిశీలకుడు ఆలీ మేథీ మాట్లాడుతూ నాయకత్వ మార్పుతో పాటు ప్రతి కార్యకర్త బాధ్యతను పెంచడమే కాంగ్రెస్ లక్ష్యమన్నారు. ఏఐసీసీ సభ్యుడు మల్లిపూడి రాంబాబు, కాకినాడ సిటీ అధ్యక్షుడు చెక్క నూకరాజు, పీసీసీ ప్రధాన కార్యదర్శి గౌతు సత్యేంద్రబాబు, పీసీసీ ఉపాధ్యక్షుడు కొత్తూరి శ్రీనివాస్, నాయకులు మలకల సూరిబాబు, మరోతి శివగణేష్, దాట్ల గాంధీరాజు, తాళ్లూరి రాజు, దవులూరి ధనకోటి, పబ్బినీడి కృష్ణ, మొయ్యేటి సూర్యప్రకాశరావు, అబ్బిరెడ్డి అప్పారెడ్డి, బత్తుల లలిత, నారాయకాపు, వనుం వెంకటరమణ, నవుడు గోవింద తదితరులు పాల్గొన్నారు.

అడబాల ట్రస్టు ఆధ్వర్యంలో ఎన్‌సీసీ దినోత్సవం


ఎన్‌సీసీ మేజర్ త్రిపుల, వీరవేణిలను సత్కరిస్తున్న దృశ్యం

సర్పవరం జంక్షన్, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): క్రమశిక్షణ, దేశభక్తి, మానవ వనరుల సద్వినియోగంతో యువతను దేశసేవకు అందుబాటులో ఉంచడంలో ఎన్‌సీసీ కీలక పాత్ర పోషిస్తుందని ఎన్‌సీసీ ముఖ్య అధికారి మేజర్ ఎ.త్రిపుల తెలిపారు. రమణయ్యపేట ఏపీఐఐసీ కాలనీలో అడబాల ట్రస్టు అధ్యక్షుడు రత్నప్రసాదరావు ఆధ్వర్యంలో ఆదివారం ఎన్‌సీసీ దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ 1948 జూలై 15న ఎన్‌సీసీ ఏర్పాటైందని, నవంబరు 4వ ఆదివారం మొదటి యూనిట్‌ను స్థాపించడంతో ఎన్‌సీసీ దినోత్సవం జరుపుకుంటున్నామన్నారు. ప్రపంచంలోనే అతి పెద్ద యూనిఫామ్ ధరించిన యువజన సంస్థ ఎన్‌సీసీ అన్నారు. భావి భారత పౌరులను దేశభక్తిగల పౌరులుగా తీర్చిదిద్దే లక్ష్యంతో ఏర్పాటు అయ్యిందన్నారు. ఎన్‌సీసీ అధికారులు త్రిపుల, జి.వీరవేణిలను సత్కరించారు. కార్యక్రమంలో ఎన్.వెంకటేశ్వరరావు, బి.సత్యనారాయణరాజు, పి.ధర్మచంద్రరాజు, సత్యనారాయణ చౌదరి తదితరులు పాల్గొన్నారు.

దత్తస్వాముల ఇంటింటా భిక్ష స్వీకరణ

పిఠాపురం, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని బొజ్జా వారి తోటలో దత్త స్వాములు ఆదివారం ఇంటింటికీ వెళ్లి భిక్ష స్వీకరించారు. దత్తమాల ధరించిన భక్తులు ఇంటింటా భిక్ష స్వీకరణ చేయడం సంప్రదాయంగా వస్తోంది.

సొంత గూటి కోసం...

రెండు ప్రభుత్వ కార్యాలయాల ఏర్పాటుకు స్థల సేకరణ

సామర్లకోట, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): సామర్లకోట మండలం, పట్టణం పరిధిలో అన్ని ప్రభుత్వ కార్యాలయాలకు సొంత భవనాలు సమకూర్చాలని ప్రభుత్వ ఉద్దేశం. అయితే సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం, వ్యవసాయ మార్కెట్ కమిటీ అద్దె భవనాల్లో నడుస్తున్నాయి. దీంతో ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప సూచనల మేరకు పట్టణ పరిధిలో ఇండస్ట్రియల్ ఎస్టేట్ సమీపాన ఎస్సీ బాలుర పాత వసతిగృహం వద్ద ఉన్న ప్రభుత్వ స్థలాన్ని సేకరించేందుకు ప్రతిపాదనలను రెవెన్యూ అధికారులు ప్రభుత్వ ఆమోదం కోసం పంపారు. సబ్ రిజిస్ట్రార్ కార్యాలయ భవనం 26 ఏళ్ల క్రితం కూలిపోగా అప్పటి నుంచీ సత్యనారాయణపురంలోని ఒక ప్రైవేట్ భవనంలోనే ఉంటోంది. నిమ్మకాయల చినరాజప్ప ఉప ముఖ్యమంత్రిగా వున్న సమయంలో ఏర్పాటుచేసిన సామర్లకోట వ్యవసాయ మార్కెట్ కమిటీ కార్యాలయం బళ్ల మార్కెట్ సమీపాన ఒక ప్రైవేట్ అద్దె భవనంలో నడుస్తోంది. ఈ రెండు కార్యాలయాలకు సొంత భవనాలు సమకూర్చేందుకు ఎమ్మెల్యే చినరాజప్ప కలెక్టర్ షాన్‌మోహన్‌తో సమీక్షించారు. విస్తరణ శిక్షణ కేంద్రానికి చెందిన 15 సెంట్ల విస్తీర్ణంలో సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం, 17 సెంట్ల విస్తీర్ణంలో వ్యవసాయ మార్కెట్ కమిటీ కార్యాలయం నిర్మించేందుకు ముందుగా స్థల సేకరణ చేపట్టి ప్రతిపాదనలను ఆమోదం కోసం కలెక్టర్‌కు రెవెన్యూ అధికారులు సమర్పించారు. స్థల సేకరణ ప్రక్రియ పూర్తయిన తర్వాత సామర్లకోటలో ఈ రెండు శాఖలకు సొంత భవనాలు నిర్మించేందుకు నిధులు మంజూరు ప్రక్రియను వేగవంతం చేస్తామని ఎమ్మెల్యే చినరాజప్ప ఆదివారం 'ఆంధ్రజ్యోతి'కి తెలిపారు.


26 ఏళ్లుగా అద్దె భవనంలో వున్న సామర్లకోట సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం

బహుముఖ ప్రజ్ఞాశాలి ఆలూరి విజయలక్ష్మి



డాక్టర్ విజయలక్ష్మిని సత్కరిస్తున్న ఎమ్మెల్యే నానాజీ

కార్పొరేషన్ (కాకినాడ), నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): వైద్యురాలిగా, రచయిత్రిగా, కళల పరిరక్షకురాలిగా, సంఘ సేవకురాలిగా తనదైన ముద్ర వేసుకున్న బహుముఖ ప్రజ్ఞాశాలి డాక్టర్ అలూరి విజయలక్ష్మి తెలుగు రాష్ట్రాల్లో ఎన్నో లక్షల మంది మన్ననలు పొందారని, ఆమె 80 ఏళ్ల జీవనయాత్ర వేడుకలో పాల్గొనడం ఆనందంగా ఉందని కాకినాడ రూరల్ ఎమ్మెల్యే పంతం నానాజీ అన్నారు. డాక్టర్ అలూరి విజయలక్ష్మి 80 ఏళ్ల జీవనయాత్ర (అశీతి) వేడుకలను ఆదివారం దంటు కళాక్షేత్రంలో నిర్వహించారు. తొలత కార్యక్రమాన్ని జ్యోతిప్రకాశనంతో ప్రారంభించారు. ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్యే నానాజీ మాట్లాడుతూ వైద్యురాలిగా ఎంత పని ఒత్తిడితో ఉన్నా కళ, సాహిత్యం పట్ల ఆమెకున్న మక్కువ ఎనలేదన్నారు. వేల మంది పేదలకు ఉచితంగా వైద్యం చేసిన ఘనత ఆమెది పేర్కొన్నారు. రెడ్‌క్రాస్ రాష్ట్ర చైర్మన్ వైడీ రామారావు, ఎన్టీఆర్ హెల్త్ యూనివర్సిటీ పూర్వ ఉపకులపతి డాక్టర్ ఐవీ రావు, రోటరీ జిల్లా పూర్వ గవర్నర్ డాక్టర్ ఎస్వీఎస్ రావు, మాజీ ఎంపీ చుండ్రు శ్రీహరిరావు, నాట్యాచార్యుడు కృష్ణకుమార్ మాట్లాడుతూ ఆలూరి ఆదర్శ మహిళామూర్తి అని కొనియాడారు. వైద్య వృత్తిని దైవంగా భావిస్తూ నిస్వార్థ సేవకురాలిగా, కళా, సాహిత్య రంగాలతో పాటు మహిళాభ్యున్నతికి సిడో ద్వారా చేసిన సేవలను వివరించారు. అనంతరం డాక్టర్ విజయలక్ష్మిని అతిథులు, ప్రముఖ వైద్యులు డాక్టర్ ఎ.సత్యవతి, డాక్టర్ కాద వెంకటరమణ, మార్ని జానకిరామ్‌చౌదరి, అల్లూరి సురేంద్ర ఘనంగా సత్కరించారు. నాట్యాచార్య కృష్ణకుమార్ శిష్య బృందం వివిధ రకాల పుష్పాలతో ఆమెకు నిలువెత్తు పుష్పాభిషేకం చేశారు. ప్రముఖ రచయిత్రి పసుమర్తి పద్మజావాణి రచించిన 'బతుకు దారిలో' కథా సంపుటిని ఆవిష్కరించారు. డాక్టర్ విజయలక్ష్మి మాట్లాడుతూ తనపై ఉంచిన ప్రేమాభిమానాలకు కృతజ్ఞతలు తెలిపారు. కాకినాడ జీజీహెచ్‌లో నూతనంగా నిర్మిస్తున్న తల్లీపిల్లల ఎమర్జెన్సీ వార్డుకు రూ.50 లక్షల విరాళాన్ని విజయలక్ష్మి అందజేశారు. మధ్యాహ్నం అలూరి విజయలక్ష్మి రచనలపై సాహితీ సమాలోచన జరిగింది. నవలలపై వాడ్రేవు వీరలక్ష్మీదేవి, కథలపై అవధానుల మణిబాబు, వైద్య విజ్ఞాన రచనలపై డాక్టర్ కాళ్లకూరి శైలజ, అనువాదాలపై అద్దేపల్లి ప్రభు ప్రసంగించారు. కార్యక్రమంలో పలు రంగాలకు చెందిన ప్రముఖులు పాల్గొన్నారు.


పూజల్లో పాల్గొన్న సుప్రీంకోర్టు న్యాయవాది రఘు దంపతులు

విగ్రహాల ప్రతిష్ఠోత్సవాలు ప్రారంభం

సామర్లకోట, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): సామర్లకోట కంచి మహా సంస్థానం ప్రసన్నాంజనేయస్వామి విగ్రహం చెంతన కంచి కామకోటి పీఠాధిపతి జగద్గురు విజయేంద్రసరస్వతి స్వామీజీ ఆశీస్సులతో సుబ్రహ్మణ్యేశ్వర, కాలభైరవ దేవతామూర్తుల విగ్రహ ప్రతిష్ఠ ఆదివారం ఘనంగా ప్రారంభమైంది. కంచి మహా సంస్థానం సామర్లకోట శాఖ అధ్యక్షుడు చంద్రాభట్ల పతంజలి, పారిశ్రామికవేత్త మట్టే శ్రీనివాస్ ఆధ్వర్యంలో వేదపండితుడు మహంకాళి వెంకటరామమూర్తి అవధాని వేద మంత్రోచ్ఛాలతో ఇంద్రగంటి సోమయాజులు పర్యవేక్షణలో గణపతి పూజ అనంతరం ఋత్విక్ వరుణలు, సుబ్రహ్మణ్య జపాలు, కాలభైరవ జపాలు నిర్వహించారు. సుప్రీంకోర్టు న్యాయవాది (న్యూఢిల్లీ) రఘు గౌరి దంపతులు ఆశీనులయ్యారు.



29, 30 తేదీల్లో పిఠాపురంలో ఎస్ఎఫ్ఐ జిల్లా మహాసభలు

పిఠాపురం, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): భారత విద్యార్థి ఫెడరేషన్ కాకినాడ జిల్లా 30వ మహాసభలు ఈ నెల 29, 30 తేదీల్లో పిఠాపురంలో జరగనున్నాయి. పట్టణంలోని ఆర్ఆర్‌బీహెచ్ఆర్ ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలో ఆదివారం నిర్వహించిన కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి ఎం.గంగాసూరిబాబు, ఇతర నాయకులు జిల్లా మహాసభల పోస్టర్లను ఆవిష్కరించారు. విద్యా వ్యవస్థలో వస్తున్న మార్పులు, విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలపై చర్చించి కార్యాచరణ రూపొందిస్తామని వారు తెలిపారు. ఎస్ఎఫ్ఐ నాయకులు లోవరాజు, సిద్దు, సత్యం, చిన్ని, కరుణాకర్, శశిజాన్, రాము, తేజశ్రీ, రత్నశ్రీ పాల్గొన్నారు.

మరిడమ్మ దేవస్థానంలో అన్నదానం

పెద్దాపురం, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): మరిడమ్మ దేవస్థానంలో సహాయ కమిషనరు కె.విజయలక్ష్మి ఆధ్వర్యంలో ఆదివారం అన్నదానం నిర్వహించారు. సుమారు 500 మంది భక్తులు అన్నప్రసాదం స్వీకరించారు. దేవస్థానం సిబ్బంది రమణ, క్రాంతివీర్ తదితరులు పాల్గొన్నారు.




స్వామి, అమ్మవార్లకు పెండ్లికుమారుడు, పెండ్లి కుమార్తె అలంకారం చేస్తున్న ప్రధానార్చకుడు

సుబ్రహ్మణ్యేశ్వర స్వామికి కల్యాణ అలంకారం

గొల్లప్రోలు రూరల్, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): గొల్లప్రోలు మండలం తాటిపర్తిలో కొలువైయున్న వల్లి, దేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామికి ఆదివారం కల్యాణ అలంకారం చేశారు. తొలుత గణపతి పూజ, పుణ్యాహవాచనం, అంకురార్పణ పూజలు నిర్వహించారు. స్వామిని పెండ్లి కుమారుడిగా, అమ్మవారిని పెండ్లి కుమార్తెగా వేదపండితులు అలంకరించారు. నెమలి పతాకాన్ని ధ్వజారోహణం గావించారు. వేద పండితుడు ఆకొండి వెంకటేశ్వరశర్మ, ప్రధాన అర్చకుడు ప్రభాకర శాస్త్రి పూజలు జరిపారు. ఆలయ కమిటీ చైర్మన్ కుంపట్ల సత్యనారాయణ, చెరుకు శ్రీను, అడపా నూకరాజు, గారపాటి శివకొండారావు, జనసేన మండల శాఖ అధ్యక్షుడు అమరాది వల్లీ రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

పిఠాపురంలో సామూహిక శత రుద్రాభిషేకం


పేదరాలికి వస్త్రాలు అందజేస్తున్న దృశ్యం

పిఠాపురం, నవంబరు 23 (ఆంధ్రజోతి): పట్టణంలోని బొజ్జావారితోటలో భగవాన్ సత్యసాయిబాబా శత జయంతి మహోత్సవాలు వైభవంగా జరిగాయి. రెండో రోజు ఆదివారం తెల్లవారుజామున నగర సంకీర్తన, ప్రశాంతి పతాక ఆవిష్కరణ నిర్వహించారు. జ్యోతిప్రజ్వలన అనంతరం సామూహిక రుద్రాభిషేకం జరిగింది. భక్తులు భారీగా తరలివచ్చారు. మహానారాయణ సేవలో భాగంగా అన్నదానం జరిపారు. అనంతరం వెయ్యి మంది పేదలకు వస్త్రాలు పంపిణీ చేశారు. చిన్నారుల సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. అనంతరం వారిని సత్కరించారు. సత్యసాయి బాబాతో తమకున్న అనుభవాలను పలువురు వివరించారు. మహా మంగళహారతి అనంతరం స్వామి ఊయల సేవ నిర్వహించారు. బొజ్జావారితోట భగవాన్ సత్యసాయి సేవాసమితి సభ్యులు, కూటమి పార్టీల నాయకులు, పెద్దలు పాల్గొన్నారు.



అప్పన్న, శ్రీను కుటుంబాలకు ఆర్థిక సహాయం అందజేస్తున్న జనసేన ప్రధాన కార్యదర్శి నాగబాబు

జనసేన కార్యకర్తల కుటుంబాలకు ఆర్థిక సాయం

పెద్దాపురం/సామర్లకోట, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): పెద్దాపురం 9వ వార్డుకు చెందిన కంది అప్పన్న, సామర్లకోట మండలం పెద్దబ్రహ్మదేవం గ్రామానికి చెందిన మామిడాల శ్రీను ఇటీవల మృతి చెందారు. వీరిద్దరూ జనసేన క్రియాశీలక సభ్యత్వం పొందిన కార్యకర్తలు. దీంతో జనసేన అధినేత, ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ ఆదేశాలతో ఆయా కుటుంబాలకు రూ.5 లక్షలు చొప్పున మంజూరు చేశారు. సంబంధిత చెక్కులను తాడేపల్లిలోని అన్నపూర్ణ ఫంక్షన్ హాల్లో ఆదివారం జరిగిన కార్యక్రమంలో జనసేన ప్రధాన కార్యదర్శి నాగబాబు అందజేశారని ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు తుమ్మల రామస్వామి (బాబు) చెప్పారు. కార్యక్రమంలో నాయకులు మలకల వెంకటేశ్వరరావు, జానకి రామారావు తదితరులు పాల్గొన్నారు.

టైప్ రైటింగ్ పరీక్షలు ఒకరోజుకు
కుదింపు నిర్ణయంపై ఆందోళన

కాకినాడ సిటీ, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): టైప్ రైటింగ్ పరీక్షలను ఒకరోజుకు కుదిస్తూ తీసుకున్న నిర్ణయంపై కాకినాడ సెంటర్ టైప్ రైటింగ్, షార్ట్‌హ్యాండ్ ఇనిస్టిట్యూట్స్ అసోసియేషన్ సభ్యులు ఆందోళన వ్యక్తం చేశారు. ఈ మేరకు ఆదివారం రామారావుపేటలో అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు ఇ.శ్రీరాములు అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. వచ్చే ఏడాది జనవరిలో టైప్ రైటింగ్ పరీక్షలను రెండు రోజులకు బదులు ఒకేరోజు నిర్వహించనున్నట్లు నోటిఫికేషన్ జారీ చేయడంపై చర్చించారు. రాష్ట్ర అధ్యక్షుడు శ్రీరాములు మాట్లాడుతూ ఒకరోజు పరీక్ష నిర్వహించడం వల్ల విద్యార్థులకు, ఇనిస్టిట్యూట్ల నిర్వాహకులకు చాలా ఇబ్బంది కలిగే అవకాశం ఉందన్నారు. అందువల్ల బోర్డు వెంటనే ఈ నిర్ణయాన్ని విరమించుకోవాలన్నారు. రాష్ట్ర గౌరవాధ్యక్షుడు సీవీ మోహనరావు, కార్యదర్శి ఏజీకే మూర్తి, కోశాధికారి నరసింహులు, కాకినాడ సెంటర్ అధ్యక్షుడు జి.శ్రీనివాస్, కార్యదర్శి లక్ష్మి, కోశాధికారి అలీమ్, సభ్యులు పాల్గొన్నారు.

నేడు జాబ్‌మేళా

కాకినాడ సిటీ, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): వికాస ఆధ్వర్యంలో సోమవారం కాకినాడలో జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్టు ప్రాజెక్టు డైరెక్టర్ కె.లచ్చారావు తెలిపారు. వివిధ కంపెనీల్లో ఉద్యోగాలకు ఎస్ఎస్‌సీ, ఇంటర్, డిగ్రీ, ఐటీఐ, డిప్లొమా, బీటెక్ ఉత్తీర్ణులైన 35 సంవత్సరాలలోపు అభ్యర్థులు అర్హులన్నారు. వీరికి నెలకు రూ.12వేల నుంచి రూ.20వేల వరకు జీతం, ఇన్సెంటివ్స్, భోజనం, వసతి, రవాణా ఆయా ఉద్యోగాలను బట్టి ఉంటుందన్నారు. ఆసక్తి గలవారు సోమవారం ఉదయం 9 గంటలకు కాకినాడ కలెక్టరేట్‌లోని వికాస కార్యాలయం వద్దకు సర్టిఫికెట్ల జెరాక్స్‌లతో హాజరు కావాలన్నారు. మరిన్ని వివరాలకు 77993 76222 నెంబరును సంప్రదించాలన్నారు.



బద్రికి సత్కారం

కాకినాడ సిటీ, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర పెరిక కార్పొరేషన్ చైర్మన్‌గా నియమితులైన వనపర్తి వీరభద్రరావు (బద్రి)ని ఆదివారం కాకినాడ సిటీ ఎమ్మెల్యే వనమాడి కొండబాబు ఆదివారం తన స్వగృహంలో శాలువాతో సత్కరించారు. పలువురు టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



అయ్యప్పస్వామి పడి పూజ

పిఠాపురం, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని కొత్తపేట కృష్ణుడి ఆలయం వద్ద అయ్యప్పస్వామి పడి పూజను ఆదివారం రాత్రి భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. అరటిడొప్పలు, పుష్పాలు, పండ్లతో అలంకరించిన ప్రత్యేక వేదికపై అయ్యప్పస్వామిని ఉంచి పూజలు జరిపారు. లక్షబిల్వార్చన జరిగింది. మొల్లి సతీష్ గురుస్వామి ఆధ్వర్యంలో జరిగిన పూజలో అయ్యప్ప స్వాములతో పాటు దత్త, శివస్వాములు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.



పెనుమర్తిలో స్వచ్ఛభారత్

సర్పవరం జంక్షన్, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): కాకినాడ రూరల్ తిమ్మాపురం అక్కు ఎంఎస్ఎన్ పీజీ క్యాంపస్ ఎన్ఎస్ఎస్ యూనిట్-1 ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ ఎం.శ్రీదేవి ఆధ్వర్యంలో ఆదివారం పెనుమర్తిలో స్వచ్ఛభారత్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎన్ఎస్ఎస్ కో-ఆర్డినేటర్ సూచన మేరకు ఈ నెల 29వ తేదీ వరకు ఈ గ్రామంలో పలు సేవ, అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. ఎన్ఎస్ఎస్ వలంటీర్లు పరిసరాల పరిశుభ్రతపై ప్రజలకు అవగాహన కల్పించారు. అనంతరం రోడ్ల పక్కన ఉన్న చెత్త, వ్యర్థాలను తొలగించారు.



వైభవంగా ధ్వజస్తంభ ప్రతిష్ఠ

గొల్లప్రోలు, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): గొల్లప్రోలు పట్టణంలోని సీతారామస్వామి దేవస్థానం (విష్ణ్వాలయం)లో నూతన ధ్వజస్తంభ ప్రతిష్ఠ ఆదివారం వైభవంగా జరిగింది. దంగేటి వారి కుటుంబసభ్యుల ఆధ్వర్యంలో వేదపండితుల మంత్రోచ్చారణలతో వైఖానసాగమరీత్యా శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఉదయం స్వస్తివాచకం, విశ్వక్సేన పూజ, పవిత్రోత్సవం, యంత్రస్థాపన, అక్షుణ్మేచనం, గోదర్శనం, పూర్ణాహుతి జరిగాయి. భక్తులు భారీగా తరలివచ్చారు. ఆలయ అధికారులు, దంగేటి కుటుంబసభ్యులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.



ఏజీపీ మూర్తికి పలువురి అభినందన

పిఠాపురం, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని సీనియర్, జూనియర్ సివిల్ జడ్జి కోర్టుల అసిస్టెంట్ గవర్నమెంట్ ప్లీడరుగా నియమితులైన పంద్రవాడ వెంకట శ్రీరామచంద్రమూర్తిని ఆదివారం పలువురు అభినందించారు. మూర్తిని కలిసిన వారిలో గోదావరి ఈస్ట్రన్ డెల్టా ప్రాజెక్టు కమిటీ చైర్మన్ మురాలశెట్టి సునీల్‌కుమార్, పిఠాపురం కో-ఆపరేటివ్ అర్బన్ సొసైటీ చైర్‌పర్సన్ చెల్లుబోయిన ప్రమీలనాగేశ్వరరావు, గుండ్ర కిషోర్, చోడిశెట్టి నాని, సంగన ఫణి కుమర్ ఉన్నారు.

జగ్గంపేట

• జగ్గంపేట • తుని • ప్రత్తిపాడు

'పెదమల్లాపురం కేంద్రంగా మండలం ఏర్పాటుచేయండి'

శంఖవరం, నవంబరు 23(ఆంధ్రజ్యోతి): పెదమల్లాపురం కేంద్రంగా గిరిజన మండలం ఏర్పాటుచేయాలని రాష్ట్ర ఎస్టీ కమిషన్ ఛైర్మన్ ఎస్.బొజ్జిరెడ్డికి గిరిజన నేతలు వినతి పత్రం అందజేశారు. నాన్ షెడ్యూల్ ఏరియా శంఖవరం, రౌతులపూడి, ప్రత్తిపాడు, ఏలేశ్వరం, కోటనందూరులో 59 గ్రామాలను కలిపి పెదమల్లాపురం కేంద్రంగా గిరిజన మండలం ఏర్పాటు, సమీకృత గిరిజనాభివృద్ధి సంస్థ(ఐటీడీఏ) ఏర్పాటు చేయాలని కోరారు. ఈకార్యక్రమంలో బి.బాలరాజుతో పాటు గిరిజనులు పాల్గొన్నారు.

రంపచోడవరం

• రంపచోడవరం • మారేడుమిల్లి • రాజవొమ్మంగి • అడ్డతీగల • వై రామవరం • గంగవరం • దేవీపట్నం • చింతూరు • కూనవరం • వీఆర్ పురం • ఎటపాక

మన్యంలో మావోల నిరసన పాక్షికం

● లోతట్టు ప్రాంతాలకు మినహా యథావిధిగా తిరిగిన ఆర్టీసీ బస్సులు

రంపచోడవరం, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): మారేడుమిల్లి ఎన్‌కౌంటర్లకు నిరసనగా మావోయిస్టులు పిలుపునిచ్చిన దేశవ్యాప్త నిరసన ప్రభావం మన్యంలో పాక్షికంగా మాత్రమే కనిపించింది. లోతట్టు ప్రాంతాలకు మినహా ఆర్టీసీ బస్సులు యథావిధిగానే తిరిగాయి. రంపచోడవరంలో వారపుసంత కూడా నిరాటంకంగా సాగింది. మన్యానికి వచ్చే టూరిస్టులు కూడా వచ్చారు. మావోయిస్టుల నిరసన ఎక్కడా స్పందనలేదని పోలీసువర్గాలు చెబుతున్నాయి.

వై.రామవరం(ఆంధ్రజ్యోతి): అల్లూరిజిల్లా మారేడుమిల్లి అడవుల్లో వరుసగా చోటుచేసుకున్న ఎన్‌కౌంటర్‌లలో హిడ్మా సహా పలువురు మావోయిస్టుల మృతి నేపథ్యంలో ఆదివారం పిలుపునిచ్చిన మావోయిస్టుల భారత్ బంద్ వై.రామవరంలో ప్రశాంతంగా జరిగింది. శనివారం నైట్‌హాల్ట్ బస్సు తో సహా ఆదివారం పూర్తిగా ఆర్టీసీ బస్సులు నిలిపివేశారు. దుకాణాలు యథావిధిగా తెరిచారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోలేదు. స్థానిక పోలీసులు గస్తీ నిర్వహించారు.

పోలవరం ముంపు సమస్యలపై మంత్రికి వినతి


మంత్రికి వినతిపత్రం అందజేస్తున్న నిర్వాసితులు

దేవీపట్నం, నవంబరు 23(ఆంధ్రజ్యోతి):పోలవరం ప్రాజెక్టు ముంపు ప్రాంత నిర్వాసితుల సమస్యలపై నీటిపారుదలశాఖ మంత్రి నిమ్మల రామానాయుడిని ఆదివారం దేవీపట్నం టీడీపీ నాయకుడు లంక హరిబాబు, (పసాద్, డాక్టర్ తొట్టా బాలాజీ, పాశాల సతీష్, మడకం రాజేష్ కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సమస్యలపై స్పందించిన మంత్రి రామానాయుడు తక్షణమే ధవళే శ్వరం అడ్మినిస్ట్రేటివ్ అభిషేక్‌కు ఫోన్ చేసి దేవీపట్నం ఆర్‌ఆర్ కాలనీకి సంబంధించి 9 ఎకరాలు కోర్టులో ఉన్న సమస్యను వెంటనే పరిష్కరించాలన్నారు. ముంపునకు గురైన 44 గ్రామాల సమస్యలు 18 సంవత్సరాలు నిండిన వారికి ఆర్‌ఆర్ ప్యాకేజీ ప్రతి ప్రాజెక్ట్ నిర్వాసితుడికి ఇల్లు నిర్మించాలని ఆదేశాలు జారీ చేశారు.

ఆదివాసీ పూజార్లకు గౌరవ వేతనం ఇవ్వాలి

చింతూరు, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): ఆదివాసీ సంప్రదాయ పూజార్లకు గౌరవ వేతనం ఇవ్వాలని ఆదివాసీ సంక్షేమ పరిషత్ చింతూరు డివిజన్ సహాయ కార్యదర్శి పైదా ముత్తయ్య డిమాండ్ చేశారు. ఆదివారం చింతూరులో సంఘ సమావేశం జరిగింది. సమావేశంలో పాల్గొన్న ముత్తయ్య మాట్లాడారు. ఆదివాసీలను ప్రకృతి ఆరాధకుడిగా గుర్తించి సంక్షేమ పథకాలు వర్తింపజేయాలన్నారు. అదేదశలో ఆదివాసీ దేవాలయాలను అభివృద్ధి చేయాలన్నారు. ఆదివాసీ కల్లుగీత కార్మికులకు బీమా సదుపాయం కల్పించాలన్నారు. ప్రత్యేకించి ఆదివాసీ కల్లు గీత కార్మికులకు సొసైటీలు ఏర్పాటుచేసి తాటివిప్ప చెట్ల ఫలసాయాల ద్వారా ఉపాధి కల్పించాలన్నారు. మన్యంలో ఆదివాసీ నిరు ద్యోగులకు ఉద్యోగభద్రత కల్పించాలన్నారు. పోలవరం ప్రాజెక్టు నిర్వాసితులకు పూర్తి స్థాయి పరిహారం చెల్లించాలన్నారు. ఆదివాసీ లకు భూమికి భూమి కేటాయింపులు జరిగాకనే నిర్వాసిత కుటుంబాలను తరలించాలన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర సహాయ కార్యదర్శి కుంజా శ్రీను, చింతూరు మండల ప్రధాన కార్యదర్శి సోడె రాఘవయ్య, రవ్వ ప్రసాద్, రమణారెడ్డి, మడవి రాజు తదితరులు పాల్గొన్నారు.

జిల్లాస్థాయి చెకుముకి సంబరాలు విజయవంతం

దేవీపట్నం, నవంబరు 23(ఆంధ్రజ్యోతి):జిల్లా స్థాయి చెకుముకి సైన్స్ సంబరాలు దేవీపట్నం మండలం ముసురుమిల్లి ప్రభుత్వ గిరిజన సంక్షేమ బాలుర ఉన్నత పాఠశాలలో ఆదివారం నిర్వహించారు. చెకుముకి సైన్స్ సంబరాలలో ప్రభుత్వ పాఠశాల విభాగంలో మొదటి బహుమతిగా రాజవొమ్మంగి ప్రభు త్వ గిరిజన సంక్షేమ బాలుర ఉన్నత పాఠశా ల, ద్వితీయ బహుమతి దామనపల్లి గిరిజన సంక్షేమ బాలికల ఉన్నత పాఠశాల, తృతీయ బహుమతి గొంటువానిపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, ప్రైవేట్ పాఠశాలల విద్యార్థులు బహుమతులు కైవసం చేసుకు న్నారు. ప్రతి పాఠశాల ఉపాధ్యాయులకు జ్ఞాపికలు కీ.శే. మంపా సోమరాజు, సన్నాసమ్మ జ్ఞాపకార్థం వారి కుమార్తె మంపా శాంతి ప్రియ ఎస్ఎ(పీఎస్) జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల రాజవొమ్మంగి వారి సహకారంతో అం దించారు. జిల్లా జన విజ్ఞాన వేదిక అధ్యక్షుడు టి.బొజ్జయ్య, గౌరవాధ్యక్షురాలు విశ్వరాజు, ఉపాధ్యక్షులు శారపు చిన్నబాబు, తదితరు లు పాల్గొన్నారు.

టీడీపీ మాజీ అధ్యక్షుడిపై పోలీసుస్టేషన్లో ఫిర్యాదు

చింతూరు, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): చింతూరు మండల టీడీపీ మాజీ అధ్యక్షుడు ఇల్లా చిన్నారెడ్డిపై అదే పార్టీకి చెందిన కార్య కర్త అనురాధ ఆదివారం చింతూరు పోలీసు స్టేషన్లో ఫిర్యాదు చేశారు. ఫిర్యాదు సారాంశమిలా..చింతూరు మండలం చూటూరుకు చెందిన తమకు తన తండ్రి సింగలదేవి రా మకృష్ణ నుంచి పోలవరం భూ పరిహారం సొమ్ములో వాటా రావాల్సి ఉందన్నారు. ఈ క్రమంలో తాము టీడీపీ మాజీ మండల అధ్యక్షుడు, అడ్వకేట్ ఇల్లా చిన్నారెడ్డిని సం ప్రదించామన్నారు. దీంతో తమ పక్షాన చిన్నారెడ్డి ఐటీడీఏ పీవో, చింతూరు పోలీసు స్టేషనుకు లిఖిత పూర్వక ఫిర్యాదు చేశారు. విషయం పోలీసుల వరకు వెళ్లడంతో తన తండ్రి తమ కుటుంబానికి రూ.20లక్షలు చెల్లించారన్నారు. తనకు బ్యాంకు అకౌంట్ లేకపోవడంతో తన అన్న బీరబోయిన కొం డబాబు (పెద్దమ్మ కుమారుడు) బ్యాంకు అకౌంట్లో రూ.20లక్షలు జమ చేశారన్నారు. ఇదిలావుండగా తమపక్షాన ఫిర్యాదు చేసిన ందుకుగాను చిన్నారెడ్డి తన అన్న కొండబాబు ద్వారా రూ.3లక్షలు అకౌంట్ ట్రాన్స్‌ఫర్ చేయించుకున్నాడని అనురాధ ఆ ఫిర్యాదులో ఆరోపించారు. ఇంత పెద్ద మొత్తంలో సొమ్ము ఎందుకు బదిలీ చేయించుకున్నారని ప్రశ్నించి నందుకుగాను చిన్నారెడ్డి తనపై దురుసుగా ప్రవర్తించారని అనురాధ ఆ ఫిర్యాదులో ఆరో పించారు. తమకు న్యాయం చేయమని పోలీ సుస్టేషన్లో ఫిర్యాదు చేశామన్నారు. ఈవిషయమై ఆంధ్రజ్యోతి చింతూరు ఎస్ఐ రమేష్‌ను వివరణకోరగా ఫిర్యాదు వచ్చిన విషయం వాస్తవమేనని తెలిపారు.

గిరిజనుల ఆరోగ్యానికి సత్యసాయి ఎనలేని సేవలు

● రంపచోడవరం ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి స్మరణ్‌రాజ్

రంపచోడవరం, నవంబరు23(ఆంధ్రజ్యోతి): మన్యంలో గిరిజనుల ఆరోగ్యం కోసం భగవాన్ సత్యసాయి అందించిన సేవలు, ఆయన సేవా ట్రస్టు ద్వారా నేటికీ అందుతున్న సేవలు భగవాన్ సత్యసాయిని చిరస్మరణీయుడిగా నిలిపాయని రంపచోడవరం ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి బి.స్మరణ్‌రాజ్ అన్నారు. ఆదివారం రంపచోడవరం ఐటీడీఏ కార్యాలయంలో సత్యసాయి చిత్రపటానికి ఆయన పూలమాలలువేసి నివాళులర్పించారు. గిరిజనసంక్షేమ కార్య నిర్వాహక ఇంజినీర్ ఐ.శ్రీని వాసరావు, పీహెచ్‌వో దేవాదానం, తహశీల్దారు పి.బాలీ సబ్‌కలెక్టర్ కార్యాలయ పరిపాలనాధికారి సావిత్రి పాల్గొన్నారు.

రాజవొమ్మంగి(ఆంధ్రజ్యోతి): పుట్టపర్తి సాయిబాబా శతజయంతి వేడుకలను రాజవొమ్మంగి మండలంలో ఆదివారం అధికారులు ఘనంగా నిర్వహించారు. మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో యాదగిరేశ్వరావు ఆధ్వర్యంలో శతజయంతి వేడుకలు నిర్వహించారు. ఎంపీపీ గోము వెంకటలక్ష్మి, ఏఐబీసీ డైరెక్టర్ గొల్లపూడి పెద్దిరాజు, ఏఎంసీ ఛైర్మన్ లోతా లక్ష్మణరావు తదితర ప్రజాప్రతినిధులు సాయిబాబ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. తహశీల్దార్ సత్యనారాయణ, సిబ్బంది ఉన్నారు.

మోతుగూడెం(ఆంధ్రజ్యోతి): మండలంలోని మెట్టగూడ గ్రామంలో భక్తులు బాబా చిత్రపటానికి పూలమాలలువేసి పూజలు నిర్వహించారు. సింధువాడ, గంగవాడ, శాంతినగర్, రెడ్డినగర్, మెట్టగూడెం, పులికొండ, బాబునగర్ గ్రామాల్లో పేదలందరికీ ఎంపీటీసీ కరకా వెంకటరమణ ప్రారంభించి అందజేశారు. ప్రతి కుటుంబానికి రగ్గులు, దుప్పట్లు అందజేశారు.

అడ్డతీగల(ఆంధ్రజ్యోతి):అడ్డతీగల సాయిభక్త సమాజంఆధ్వర్యంలో సత్యసాయి శతజయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆలయం వద్ద మహా అన్నదానం చేశారు.

వై.రామవరం(ఆంధ్రజ్యోతి): స్థానిక మండల పరిషత్ కార్యాలయం లో ఎంపీడీవో బాపన్న దొర ఆధ్వర్యంలో సత్యసాయి చిత్రపటానికి పూలమాలలు వేసి పలువురు నివాళులర్పించారు. కార్యక్రమం లో వీర్‌వోలు, ఉపాధి, మండల పరిషత్ సిబ్బ ంది, విద్యార్థులు పాల్గొన్నారు.

రైతుల్లో కలవరం...

● పొంచి ఉన్న తుఫాన్ గండం ● వాతావరణశాఖ హెచ్చరికలు


కిర్లంపూడిలో పొలంలో ఉన్న వరి పనలు

కిర్లంపూడి, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): ఇప్పటికే కోతలు ప్రారంభించిన రైతులు వారం పది రోజుల్లో ముమ్మరం చేసే పరిస్థితిలో తుఫాన్ హెచ్చరికలతో దిక్కుతోచని స్థితిలో ఉన్నారు. గత నెలలో సంభవించిన మొంథా తుఫాన్ నష్టం నుంచి ఇప్పుడిప్పుడే బయట పడుతుండగా బంగాళాఖాతంలో మరో తుఫాన్ ఏర్పడుతుందన్న వాతావరణశాఖ హెచ్చరికలతో అన్నదాతలు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. ముఖ్యంగా వరి రైతులు బెంబేలెత్తిపోతున్నారు. ప్రస్తుతం వరి పైరు గింజ పాలు పోసుకునే దశ నుంచి కోత దశ వరకు ఉంది. ఇటువంటి తరుణంలో తుఫాన్ సంభవిస్తే తీవ్రంగా నష్టపోతామని రైతులు వాపోతున్నారు. ముందుగా వరినాట్లు వేసిన పొలాల్లో 2,3 రోజుల క్రితం కోతలు ప్రారంభించారు. బోర్లు ఉన్నచోట కోతలు పూర్తి చేసి కుప్పలు వేస్తున్నారు. కిర్లంపూడి మండలంలో 13వేల ఎకరాలకుగాను ఇంకా 2500 ఎకరాల్లో వరి కోతకు సిద్ధంగా ఉంది. తుఫాన్ వస్తుందన్న హెచ్చరికలతో కొంతమంది రైతులు హడావిడిగా వరికోతలు ప్రారం భించారు. ఈనెల 26 నుంచి 29 వరకు వర్షాలు ఉంటాయని వాతావరణ శాఖ సమాచారం మేరకు రైతులు ఆందోళన చెందుతున్నారు.

రైతులు అప్రమత్తంగా ఉండాలి

రైతులు అప్రమత్తంగా ఉండాలి. వాతావరణ శాఖ హెచ్చరికలతో వరి పంటను త్వరగా నూ ర్పుకోవాలి. పొలాల్లో కుప్పలు తడవకుండా జాగ్రత్తలు తీసుకోవాలి.

వరి కోతలు వాయిదా వేసుకోండి

దేవీపట్నం, నవంబరు 23(ఆంధ్రజ్యోతి):రానున్న రెండురోజులలో వర్షాలు పడే అవకాశం ఉందని వాతావరణశాఖ తెలిపిందని మండలంలోని రైతులందరూ వరి పంటను కోయకుండా వాయిదా వేసుకోవాలని వ్యవసాయ అధికారులు తెలిపారు. ఇప్పటికే కోసేసిన పనలు ఏమైనా ఉంటే కు ప్పలుగా వేసుకోవాలన్నారు. అదే రాసులుగా పోసి ఎండబెట్టిన ధాన్యాన్ని సురక్షిత ప్రాంతాలకు తరలించాలన్నారు.

రోడ్డు ప్రమాదాల నివారణకు చర్యలు



గండేపల్లి జాతీయ రహదారిపై హైవే మొబైల్ వాహనంవద్ద పోలీసులు

గండేపల్లి, నవంబరు 23(ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్ర మాదాల నివారణకు పోలీసులు విస్తృత చర్యలు తీ సుకుంటున్నారు. ఆదివారం గండేపల్లి జాతీయ రహదారిపై హైవే మొబైల్ వాహనాలకు ఇరువైపులా ఫెక్సీలు ఏర్పాటు చేశారు. హైవేపై వాహనాలు నిలపరాదని, ట్రాఫిక్ నియమాలు పాటించాలని, రోడ్డు ప్రమాదాలు నివారించాలని, అతివేగంతో వాహనం నడపవద్దని వాయిస్ రికార్డ్ వినిపిస్తున్నా రు. పూర్తిస్థాయిలో రోడ్డు ప్రమాదాలు నివారించేందుకు చర్య లు తీసుకుంటున్నామని జగ్గంపేట సీఐ వైఆర్‌కె శ్రీని వాస్, గండేపల్లి ఎస్ఐ శివనాగబాబు తెలిపారు.

మద్యంతాగి వాహనం నడిపితే చర్యలు

జగ్గంపేట(ఆంధ్రజ్యోతి): మద్యం సేవించి వాహనా లు నడిపితే చర్యలు తప్పవని జగ్గంపేట ఎస్ఐ టి.రఘునాథరావు వాహనదారులను హెచ్చరించారు. ఆదివారం జగ్గంపేట గ్రామశివారు గోకవరం వెళ్లే రోడ్డులో ఎస్ఐ తన సిబ్బందితో కలిసి డ్రంక్ అండ్ డ్రైవ్ నిర్వహించారు. ద్విచక్ర, ఆటోలు, కార్లు ఇతర వా హనాలను నిలుపుదలచేసి డ్రైవింగ్ చేస్తున్న వారికి డ్రంక్ అండ్ డ్రైవ్ చేశారు. మద్యం తాగి వాహనాలు నడపడంవల్ల ప్రమాదాలు జరుగుతున్నాయన్నారు.

వాహనదారులు నిబంధనలు పాటించాలి

రౌతులపూడి(ఆంధ్రజ్యోతి): వాహనదారులు నిబంధనలు పాటించాలని లేకుంటే కఠినచర్యలు తప్పవని రౌతులపూడి ఎస్ఐ జి.వెంకటేశ్వరరావు అన్నారు. పారుపాక సెంటర్‌లో వాహనాలను తనిఖీ చేశారు. నిబంధనలు పాటించని పలువురికి చలానాలు విధించారు. డ్రంక్ అండ్ డ్రైవ్ నిర్వహించగా ఒకరిపై కేసు నమోదు చేసినట్టు తెలిపారు.


లేబర్ కోడ్‌ల అమలును వ్యతిరేకిస్తూ నిరసన



ఆందోళన చేస్తున్న రైతు కూలి సంఘం నాయకులు

జగ్గంపేట, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): కార్మిక వ్యతిరేక 4 లేబర్ కోడ్‌ల అమలు జీవోను వ్యతిరేకిస్తూ ఆదివారం జగ్గం పేట మండలం రామవరం గ్రామపంచాయతీ రంగవల్లినగర్ లో నిరసన కార్యక్రమం చేశారు. ఈ సందర్భంగా ఏపీ ఆర్‌సీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కర్నాకుల వీరాంజనేయులు మాట్లాడుతూ, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కార్మిక హక్కులను కాలరాస్తూ లేబర్ కోడ్‌లు అమలుచేయడాన్ని తీవ్రంగా ఖండి ంచారు. ప్రతి సంవత్సరం పెట్టుబడిదారుల సదస్సు నిర్వహి స్తున్న కేంద్ర ప్రభుత్వం, కార్మికుల సమస్యల ప్రస్తావన చేసే లేబర్ కాన్ఫరెన్స్ నిర్వహణ 2015 నుంచి మానేసి తన వర్గ స్వభావాన్ని చూపించుకుందన్నారు. ఈ 4 లేబర్ కోడ్లు కార్మికుల హక్కుల పాలిట ఉరితాడుగా మరతాయని, నయా బానిసలుగా మారకముందే కార్మికులందరూ ఐక్యంగా బీజేపీ ప్రభుత్వ కార్మిక వ్యతిరేక విధానాలపై రాజకీయ పోరాటానికి సిద్ధపడాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో రంగవల్లినగర్ నాయకులు డాన్ శీను, సోమరాజు, దేవి, సూరిబాబు తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి జనసేన సాయం అందజేత


బాధిత కుటుంబానికి ఆర్థిక సహాయం అందజేస్తున్న జనసేన నాయకులు

తునిరూరల్, నవంబరు 23(ఆంధ్రజ్యోతి):ఇటీవల పలు ప్రమాదాల్లో మృతి చెందిన పట్టణానికి చెందిన తాతపూడి చిన్నయ్య, కుర్రా వరలక్ష్మిలకు జనసేన అండగా నిలిచింది. జనసేన తరుపున వారికి రూ.5లక్షలు సాయం అందించారు. ఎంపీ తంగెళ్ల ఉదయ శ్రీనివాస్, జిల్లా పార్టీ అధ్యక్షుడు తుమ్మలబాబు ఆధ్వర్యంలో ఎమ్మెల్సీ కొణిదెల నాగబాబు మంగళగిరిలో చెక్కు అందజేశారు.

'యువత వ్యాపార రంగాల్లో రాణించాలి'

ప్రత్తిపాడు, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): యువత వ్యాపార వాణిజ్యరంగాల్లో రాణించాలని ప్రత్తిపాడు ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ రాజా సూచించారు. ప్రత్తిపాడు వేగులమ్మగుడి సమీపంలో నిరుద్యోగ యువకుడు పత్రి దుర్గా వరప్రసాద్ నూతనంగా ఏర్పాటుచేసిన ఇరాని ఫ్రాంచ్స్ సంస్థను ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ నిరుద్యోగ యువత ప్రభుత్వ ఉద్యోగాలకోసం ఎదురుచూసి కాలం వృథా చేయకుండా వ్యాపార వాణిజ్యరంగాల్లో ఎదగాలని ఆకాంక్షించారు. రాష్ట్ర ఖాదీ బోర్డు వైస్‌చైర్మన్ కొమ్ముల కన్నబాబు, రాష్ట్ర రోడ్డు డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఛైర్మన్ వెన్నా ఈశ్వరుడు, కత్తిపూడి సొసైటీ ఛైర్మన్ జి.కృష్ణమూర్తి, మాజీ సర్పంచ్ యాళ్ళ విశ్వేశ్వరరావు, వెలుగుల నాని, పత్రి రమణ, మెల్లిపాక నాగ సత్యనారాయణ, టీడీపీ నాయకులు యర్రాబత్తుల గోవిందనాయుడు, రాంబాబు, మాజీ ఎంపీటీసీలు శెట్టి బత్తుల వీరబాబు, సాధనాల లక్ష్మీబాబు పాల్గొన్నారు.

పెరికి కార్పొరేషన్ ఛైర్మన్‌కు ఎమ్మెల్యే సత్కారం


పెరిక కార్పొరేషన్ ఛైర్మన్ వనపర్తి వీరభద్రరావును సత్కరిస్తున్న ఎమ్మెల్యే, తదితరులు

ప్రత్తిపాడు, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర పెరికి వెల్ఫేర్ అండ్‌డెవలప్‌మెంట్ సొసైటీ కార్పొరేషన్ ఛైర్మన్‌గా నియమితులైన వనపర్తి వీరభద్రరావుని ఆదివారం ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ రాజా ఘనంగా సన్మానించి అభినందించారు. కార్పొరేషన్ ఛైర్మన్ వనపర్తి బద్రి భారీ అనుచరగణంతో ఆదివారం మండలంలోని పెదశంకర్లపూడి టీడీపీ కార్యాలయానికి తరలివెళ్లి ఎమ్మెల్యేకు శాలువాకప్పి బొకే అందజేసి కృతజ్ఞతలు తెలిపారు. ఎమ్మెల్యే ఛైర్మన్ బద్రిని సన్మానించి అభి నందించి పెరికి సామాజిక వర్గీయుల సమస్యలు పరిష్కారానికి కృషి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఏలేశ్వ రం మాజీ జడ్పీటీసీ జ్యోతుల పెదబాబు, పెరికి సంఘం నాయకులు ధనేకుల భద్ర ం, వెంకట్రావు తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూను కలిసిన వీరభద్రరావు

జగ్గంపేట(ఆంధ్రజ్యోతి): నూతనంగా రాష్ట్ర పెరిక కార్పొరేషన్ ఛైర్మన్‌గా నియమితులైన వనపర్తి వీర భద్రరావు ఆదివారం జగ్గంపేట ఎమ్మెల్యే, టీడీపీ బోర్డు సభ్యుడు జ్యోతుల నెహ్రూను, కాకినాడ జిల్లా టీడీపీ అధ్యక్షులు జ్యోతుల నవీన్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. అన ంతరం ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ, జ్యోతుల నవీన్ బద్రిని ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా బద్రి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వ పెద్దలు, ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ, జ్యోతుల నవీన్ ఆశీస్సులతో రాష్ట్ర పెరిక కార్పొరేషన్ ఛైర్మన్‌గా బాధ్యతలు తీసుకుంటున్నాను వీరి సహకా రంతో పెరిక కులాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తానని అన్నారు. ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ మాట్లాడుతూ బద్రి పార్టీ కోసం కష్టపడి పనిచేసే వ్యక్తి అని ఆయనను పార్టీ గుర్తించి గౌరవించిందన్నారు. మల్లేపల్లి సొసైటీ ఛైర్మన్ దిడ్డి వెంకట్‌రాజు, గండేపల్లి మాజీ జడ్పీటీసీ యర్రంశెట్టి బాబ్జి, కిర్లంపూడి మండల టీడీపీ ప్రధాన కార్యదర్శి గోడే బాల, రామకృష్ణాపురం సర్పంచ్ కంత శ్రీను, వనపర్తి సాంబశివరావు, పల్లపు సుబ్బా రావు, నడిశెట్టి రాంబాబు, బీజేపీ జిల్లా కార్యదర్శి గొల్ల శ్రీనివాస్ జిల్లా పెరిక కుల పెద్దలు, రాష్ట్ర, జిల్లా పెరిక సాధికార క సమితి కన్వీనర్లు, సభ్యులు పాల్గొన్నారు.

సత్యసాయి బోధనలు ఆచరణదాయకం

● వైభవంగా సత్యసాయి జయంతి


ఏలేశ్వరంలో సత్యసాయి జయంతి వేడుకల్లో పాల్గొన్న భక్తులు

ప్రత్తిపాడు, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి):పుట్టపర్తి భగవాన్ సత్యసాయిబాబా బోధనలు ఆచరణదాయకమని శాంతి, ధర్మం కోసం కృషి చేసిన మహనీయుడని పలువురు కొనియాడారు. స్థానిక సత్యసాయి మందిరంలో ఆదివారం సాయంత్రం భగవాన్ సత్యసాయిబాబా జయంతిని ఘనంగా నిర్వహించారు. మహిళలు భజనలు, ప్రార్థన గేయాలు ఆలపించారు. విశ్రాంత ఉపాధ్యాయులు జంధ్యం సుబ్బారావు,కొమ్ముల మహేశ్వరరావు, సాయి సేవాదళ్ ప్రతినిధులు మటపర్తి లక్ష్మణకుమార్, నాని, రాజ్యలక్ష్మి, ఈశ్వరి, స్వామి, సీత పాల్గొన్నారు.

వృద్ధులకు దుప్పట్లు, పండ్లు పంపిణీ

గండేపల్లి(ఆంధ్రజ్యోతి): మానవసేవే మాధవ సేవ అని తెలియజేసిన మహోన్నత వ్యక్తి పుట్టపర్తి సాయిబాబా అని జెడ్.రాగంపేట సర్పంచ్ కందుల చిట్టిబాబు అన్నారు. గండేపల్లి మండలం జెడ్.రాగంపేట గ్రామంలో ఆదివారం పుట్టపర్తి సాయిబాబా 100వ జయంతి వేడుకలు కందుల చిట్టిబాబు కుటుంబ సభ్యుల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా రామాలయంలోని పుట్టపర్తి సాయిబాబా చిత్రపటం వద్ద బాబాకి ఊయల, కుర్చీ, పూలపాన్పులను ప్రత్యేక పూలతో అలంకరించారు. అనంతరం గ్రామంలోని 250 మంది వృద్ధులకు, వికలాంగులకు, 50వేల రూపాయల విలువైన దుపట్లు, పండ్లు, ప్రాథమిక పాఠశాలలోని ఒకటి నుంచి ఐదు తరగతుల విద్యార్థులకు రూ.10వేల విలువైన పుస్తకాలను పంపిణీ చేశారు. గ్రామంలోని వెయ్యి మందికి అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో కందుల చంటమ్మ, కందుల చిట్టిబాబు దంపతులు, విజయ్, వినయ్ దంపతులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

ఏలేశ్వరం(ఆంధ్రజ్యోతి): స్థానిక సత్యసాయి సేవాసమితి నేతృత్వంలో ఆదివారం భగవాన్ సత్యసాయి శత జయంతిని వైభవంగా నిర్వహించారు. సమితి కార్యాలయం వద్ద తెల్లవారుజాము నుంచి నగర సంకీర్తన, అభిషేకాలు, నామసంకీర్తన పూజలు చేశారు. బాబా చిత్రపటంతో గ్రామోత్సవం నిర్వహించారు. కౌన్సిలర్ అలమండ చలమయ్య, మట్టే సుబ్బారావు, గూనాపు అప్పలరాజు, పెద చలమయ్య సత్యసాయి బృందం పాల్గొన్నారు.

సైన్స్ మ్యూజియాన్ని సందర్శించిన విద్యార్థులు



రౌతులపూడి, నవంబరు 23(ఆంధ్రజ్యోతి): రౌతులపూడి జిల్లా పరిషత్ హైస్కూల్ విద్యార్థులు ఆదివారం రాజమండ్రి సైన్స్ మ్యూజియంను సందర్శించారు. 150 మంది విద్యార్థులకు వివిధ అంశాలను వివరించారు. ధవళేశ్వరం ఆనకట్టను సందర్శించారు. ఆనకట్టవల్ల లక్షలాది ఎకరాలు అందుతున్న సాగునీరు గురించి వివరించారు. రోడ్‌కమ్ రైల్వే వంతెన, గోదావరి ఘాట్స్, తదితర ప్రాంతాలను విద్యార్థులకు చూపించారు. ఈకార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు కోళ్ల రాంబాబు, పాఠశాల ఛైర్మన్ షేక్ సలీం, ఉపాధ్యాయులు ఉన్నారు.


ప్రత్యేక అలంకరణలో తలుపులమ్మ అమ్మవారు

లోవకు పోటెత్తిన భక్తులు

● ఆలయానికి రూ.4.27లక్షల ఆదాయం

తునిరూరల్, నవంబరు 23(ఆంధ్రజ్యోతి):ప్రసిద్ధి పుణ్యక్షేత్రం లోవ దేవస్థానానికి ఆదివారం భక్తులు పోటెత్తారు. వేకువజామునే వేలాది మంది భక్తులు ఆలయానికి చేరుకోవడంతో ఆలయ పరిసరాలు కిటకిటలాడాయి. ప్రత్యేక క్యూలైన్‌లో బారులుతీరిన భక్తులు అమ్మవారికి మొక్కులు చెల్లించున్నారు. కుటుంబ సమేతంగా వచ్చిన భక్తులు దేవస్థానం ఏర్పాటుచేసిన వసతిగదుల్లో వంటావార్పు చేసుకుని సహపంక్తి భోజనాలు చేశారు. భక్తుల సౌకర్యార్థం ఆలయం అధికారులు ప్రత్యేక ఏర్పాట్లుచేసిన తీర్థ ప్రాదాలు అందజేశారు. ఆదివారం ఒక్కరోజు ఆలయంలో వివిధ విభాగాల ద్వారా రూ.4.27లక్షల ఆదాయం సమకూరినట్లు ఆలయ కార్యనిర్వహణాధికారి విశ్వనాథ్ రాజు తెలిపారు. .

వీహెచ్‌పీ ఆధ్వర్యంలో భగవద్గీత కంఠస్థ పోటీలు

ప్రత్తిపాడు, నవంబరు 23(ఆంధ్రజ్యోతి):మండలంలోని రాచపల్లి రమణ సేవా ఆశ్రమంలో విశ్వహిందూ పరిషత్ ఆధ్వర్యంలో భగవద్గీత 12వ అధ్యాయం భక్త యోగంపై కంఠస్థ పోటీలు నిర్వహించారు. ఈ పోటీలో ధర్మవరంలో ఆదర్శ, ఉత్తరకంచి ఆక్స్‌ఫర్డ్, ఒమ్మంగి భారతి విజ్ఞానికేతన, కిర్లంపూడి విజ్ఞాన భార తి, యర్రవరం శ్రీ సూర్య జడ్పీహెచ్ఎస్, ధర్మవరంతోపాటు స్థానిక కళాశాల విద్యార్థులు పాల్గొన్నారు. ఈ పోటీల్లో ఆదర్శ స్కూల్‌కు చెందిన ఆన్ జాహ్నవి ప్రథమబహుమతి, బాల ఏసుకుమారి ద్వితీయ బహుమతి, డి.గంగాశ్రీ తృతీయ బహుమతులు గెలుపొందారు. అలాగే జూనియర్ విభాగ ంలో విజేతలకు రమణ సేవాశ్రమ వ్యవస్థాపకులు స్వామి రామానంద బహుమతులు అందజేయగా న్యాయ నిర్ణేతలుగా విశ్వ హిందూ పరిషత్ జిల్లా అధ్యక్షుడు ఆర్.రవిశంకర్ పట్నాయక్, సుమ పట్నాయక్, జిల్లా కోశాదికారి ఉదయ భానుజీ రావు, గంధం గోవిందు, ఉప్పల తిరుపతయ్య, దుర్గాదేవి, బొచ్చు సత్య తదితరులు పాల్గొన్నారు.

ఏలేశ్వరంలో..


ఏలేశ్వరంలో పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేస్తున్న నిర్వాహకులు

ఏలేశ్వరం, నవంబరు 23(ఆంధ్రజ్యోతి): విశ్వహిందూ పరిషత్ నేతృత్వంలో స్థానిక కోనేటి పాఠశాల ఆవవరణలో ఆది వారం భగవద్గీత కంఠస్థ పోటీలు నిర్వహించారు. సుమారు 90 మంది పెద్దలు, పిల్లలు ఎంతో ఉత్సాహంగా పోటీల్లో పాల్గొన్నారు. ఈపోటీలో విజేతలు పి.మాధురి, సీతామహాలక్ష్మీ, సంధ్య, అనురాధ, ఐశ్వర్యభాను, మనీషా, పూర్ణసాయి, దాక్షిణ్య, హస్విక సంహితలకు మెమెంటో, షీల్డ్, ప్రసంసా పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు అలమండ దుర్గా వెంకటప్రసాద్, కార్యదర్శి కటకం కిరీటి, గొల్లపూడి సత్యనారాయణ, గొల్లపూడి గణేష్, పాబోలు దేవి, గిరిజ, ఇందిరా, శారద, మల్లేశ్వరి పాల్గొన్నారు.

ఘనంగా చండీహోమం



అన్నవరం, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): సత్యదేవుడి తొలిపావంచావద్ద ఉన్న కనకదుర్గ ఆలయంలో ఆదివారం అమ్మవారి జన్మనక్షత్రం మూల సందర్భంగా ఆలయంలో ప్రత్యేకపూజలు నిర్వహించారు. ఈసందర్భంగా 10 గంటలకు అమ్మవారికి చండీహోమం నిర్వహించారు. పండితులు గణపతిపూజ, పుణ్యాహవచనం అనంతరం హోమాలు, జపములు, పారాయణలు చేపట్టారు. 11గంటలకు పవిత్ర హోమగుండంలో సుగంధద్రవ్యాలను అర్పించి పూర్ణాహుతి గావించారు. చతుర్వేద పండితుల వేదాశీర్వచనాలు అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.

ఏఐసీసీ పరిశీలకుడిని కలిసిన డీసీసీ ఉపాధ్యక్షుడు


అలీమేజిని కలిసిన డీసీసీ ఉపాధ్యక్షుడు ధర్నాలకోట శ్రీను

ప్రత్తిపాడు, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి):ఏఐసీసీ పరిశీలకుడు అలీమేజిని ఆదివారం ప్రత్తిపాడుకు చెందిన జిల్లా కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షులు ధర్నాల కోట శ్రీను మర్యాదపూర్వకంగా కలిశారు. కాకినాడలో జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయానికి విచ్చేసిన జిల్లా పరిశీలకుడు అలిమేజిని కలిసి ప్రత్తిపాడు నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో జరుగుతున్న కార్యక్రమాలు వివరించారు. అలిమేజి పార్టీ బలోపేతానికి నాయకులు, కార్యకర్తలు కృషి చేయాలన్నారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు మొయ్యేటి సూర్యప్రకాశరావు, జిల్లా నాయకులు కొప్పన కోటేశ్వరరావు, కొల్లు వీర గణేష్ పాల్గొన్నారు.

ప్లాస్టిక్ వాడకంతో అనర్థాలు


ప్లాస్టిక్ వాడకంపై అవగాహన కల్పిస్తున్న విద్యార్థులు

శంఖవరం, నవంబరు23(ఆంధ్రజ్యోతి): ప్లాస్టిక్ వాడకంపై కలిగే అనర్థాలపై కత్తిపూడి సీతారామ డిగ్రీ కళాశాల ఎన్ఎస్ఎస్ విద్యార్థులు ప్లాస్టిక్ వాడకం వలన కలిగే అనర్థాలను వివరించారు. ఇంటింటికీ వెళ్లి అవగాహన కల్పించారు. రెండు రోజులుగా ఎన్‌సీసీ విద్యార్థులు ప్లాస్టిక్‌పై ప్రజలకు అవగాహ న కల్పిస్తున్నట్లు కళాశాల సిబ్బంది తెలిపారు.